తక్కువ ధరకే ప్రకటనలు

మీ వ్యాపార అభివృద్ధి కొరకు..
ప్రకటనలు అత్యంత తక్కువ ధరకే
(అన్ని పత్రికల కంటే తక్కువ ధరకే)
ప్రతి రోజు వేయబడును
ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ
సెల్ : 79894 45029 సెల్ : 73862 03537
email: suryaudhyamdaily@gmail.com

RNI APTEL /2017/74254

# సూర్య ఉదయం

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.
ఐడి కార్డు ఉచితం
యం.సునీల్ కుమార్
సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్
సెల్ : 08512 254632

ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 109 శనివారం 14 - 03 - 2026 పేజిలు : 08 వెల రూ. 5 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad

## రాష్ట్రంలో భారీగా
# భూ కేటాయింపులు

- పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట
- ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం
- కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు
- గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ - మిగతా 2 లో

## ఇక 24 గంటలూ
# షాపులు ఓపెన్..!

2 లో

- ఏపీ వ్యాపారులకు గుడ్ న్యూస్
- ఏపీలోని ప్రధాన ప్రాంతాల్లో 24 గంటలూ షాపుల నిర్వహణకు అనుమతి
- సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఉద్యోగులకు వారానికి 48 గంటల పని, ఓవర్ టైం చెల్లింపు తప్పనిసరి
- 20 మందికి పైగా సిబ్బంది ఉన్న సంస్థలకు లైఫ్ టైమ్ రిజిస్ట్రేషన్ అవకాశం




## ఏపీ హైకోర్టు జడ్జిగా
# జస్టిస్ లిసా గిల్

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణస్వీకారం
- లిసా గిల్ తో ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా
- న్యాయరంగంలో జస్టిస్ లిసాకు అపారమైన అనుభవం

## ఈశాన్యంలో
# బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని
- ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు
- బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు



**ఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు.అసోంలోని - మిగతా 2 లో




# వారిని అంతం చేస్తున్నా

- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు
- అక్కడి పాలకులు 47 ఏళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన
# కాసేపటికే భారీ పేలుడు

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు
- పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుడ్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం
- హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం
- పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు



**ఢిల్లీ :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుడ్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహార్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుడ్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.ప్రస్తుతం ఈ ఘటనలో - మిగతా 2 లో




## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ
- హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించాం
- పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు
- 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన

## అమిత్ షాకు
# కేటీఆర్ లేఖ




- రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు
- అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు

## గ్యాస్ కొరత లేదు..
# వదంతులు నమ్మొద్దు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం
- ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు
- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ
- ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం




**హైదరాబాద్ :** తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా - మిగతా 2 లో




సూర్య ఉదయం
తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 03 - 2026

# సంపాదకీయం

## నవ నేపాల్

ఇది జెన్‌జీ విజయం అంటున్నారంతా. నేపాలీలు గత పాలకులపట్ల ఎంత ఆగ్రహంగా ఉన్నారో బాలెన్‌షా ఘనవిజయం స్పష్టంగా తెలియచెబుతోంది. ఒక పార్టీ మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి రావడమన్నది ఆ దేశం ఎన్నడూ చూడనిది. పదిహేడేళ్ళ ప్రజాస్వామ్య చరిత్రలో , చివరకు 2008లో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మావోయిస్టులకు కూడా దక్కనంత అపూర్వమైన ప్రజాదరణ రాష్ట్రీయ స్వతంత్రపార్టీకి లభించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రబీ లామిచేని, కాబోయే ప్రధాని బాలెన్‌షాలను భారతప్రధాని నరేంద్రమోదీ అభినందించి, పరస్పర సహకారంతో కలసి సాగుదామనడం, వారిద్దరూ చక్కగా, సానుకూలంగా ప్రతిస్పందించడం బాగుంది.సినిమా ఆఖరుఘట్టంలో దుష్టనాయకులను జనం తరిమితరిమికొట్టినట్లుగా నేపాల్ ప్రజలు తమకు నచ్చనివారిని అవమానకరమైన రీతిలో దింపేశారు. ఇది క్షణికావేశమనీ, సోషల్‌మీడియా నిషేధం ద్వారా ఖడ్గప్రసాద్ శర్మ ప్రభుత్వం కొరివితో తలగోక్కుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసిన సోషల్ మీడియా సంస్థలను చూసీచూడనట్టుగా వదిలివేసి ఉంటే నేపాల్‌లో ఏ మార్పూ ఉండేది కాదా? అన్నది అటుంచితే, ప్రజల్లో ఏళ్ళతరబడి గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా పెల్లుబుకడానికి ఆ నిషేధం దోహదం చేసింది. పాలకులు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నా, వీధుల్లోకి వచ్చిన జనం నాయకులను దించేసేవరకూ వెనక్కుపోలేదు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్నవారిని ఒక మహోద్యమంతో స్వల్పకాలంలోనే గద్దెదించేసిన ప్రజలు తగిన విచక్షణతో సరైనవారిని ఎన్నుకోగలరా? అన్న ప్రశ్నకు సమాధానంగా నేపాలీలు ఇప్పుడు బాలెన్‌షాను ముందుకు తెచ్చారు. పాతతరాన్ని వెనక్కునెట్టి, నవనాయకత్వాన్ని అధికారంలో కూచోబెట్టుకున్నారు.బాలెన్ సారథ్యంలో నేపాల్ ఒక కొత్త ప్రయాణం ఆరంభించింది. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, పహాడీలు, మధేశీలు అంటూ ఒక విభజన ఉండేది. ఇప్పుడు కొండ, లోయ ప్రాంతాలవారిద్దరూ ఒక్కటిగా బాలెన్‌కు పట్టం కట్టారు. మధేశీ, మైథిలీ మూలాలున్న వ్యక్తి ప్రధాని కావడం కూడా ఇదే మొదటిసారి. జెన్‌జీ ఉద్యమానికి నాయకత్వం వహించి నేపాలీలందరినీ ఏకతాటిపై నిలబెట్టడమేకాక, ఎన్నికలకు రెండునెలల ముందే ఆర్‌ఎస్‌పితో చేయి కలిపి దానికి ఘనవిజయాన్ని చేకూర్చడం విశేషం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతరత్రా చిన్నా చితకా పార్టీలన్నీ ఒక్కటై బాలెన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాయన్న భయం కూడా ప్రజల్లో ఉన్నందునే ఆయనకు ఇంతటి ఘన విజయం చేకూరి ఉంటుంది. జెన్‌జీ ఉద్యమం దెబ్బకు కకావికలైన నాయకులంతా తిరిగి ఎన్నికల బరిలో నిలవడం, పార్టీ అంతర్గత సంస్కరణల పేరిటా, హామీల పేరిటా మళ్ళీ మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో, ఎన్నికల అనంతరం వీరంతా ఒక్కటై తమ నెత్తిన కూచోకుండా ప్రజలు ముందుగానే జాగ్రత్తపడ్డారని అర్థం.అనాదిగా సంకీర్ణ ప్రభుత్వాలనే అనుభవిస్తూ వచ్చిన నేపాలీలు ఇకపై ఆ అవసరమే లేని ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకున్నారు. ఆయా రాజకీయపార్టీల మధ్య కుట్రలకు, వాటి నాయకుల మధ్య వెన్నుపోట్లకు తావులేకుండా చేశారు. అత్యంత కీలకమైన, విధానపరమైన నిర్ణయాలకు మోకాలడ్డుతూ తమదే పై చేయి కావడంకోసం ప్రజావ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు స్వస్తిపలికారు. దశాబ్దంన్నరకు పైగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఐదేళ్ళకు మించి నిలవని దేశంలో ఒక పార్టీకి కనీవినీ ఎరుగనంత మెజారిటీ కట్టబెట్టి సుస్థిరత సాధించుకున్నారు.ఒక గాయకుడు, ఒక టీవీస్టార్ చేయీచేయీ కలిపి అధికారంలోకి రావడం



బాగున్నది కానీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే పెద్ద సవాల్. పాలనానుభవం లేని ఈ యువనాయకుల మీద ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. పదిహేడేళ్ళుగా తమను మోసం చేస్తున్న నాయకుల మాదిరిగా వీరు వ్యవహరించబోరని, తమను అష్టదరిద్రాలనుంచి బయటపడవేస్తారని జనం ఆశిస్తున్నారు. ప్రజలు ఎక్కువ కాలం ఓపికగా నిరీక్షించలేరన్న మాట నిజమే కానీ, వారి ఆశలన్నీ నెరవేర్చలేకపోయినా, అవినీతి, ఆశ్రితపక్షపాతాలకూ ఖర్చుదారీ విధానాలకూ దూరంగా ఉంటూ దేశాన్ని క్రమంగా గాడినపెట్టడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తే అంతే చాలు. అధికారంలోకి రావడంకోసం అతివేగంగా ఒక్కటైన ఈ నాయకులు ఇద్దరూ రేపటిరోజుల్లో తమ మధ్య తలెత్తే విభేదాలను త్వరితంగా పరిష్కరించుకుంటూ ఐదేళ్ళూ కొనసాగడం మరింత ముఖ్యం.

## రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

**మొదటిపేజీ తరువాయి –** నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్‌ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్‌ఆర్‌ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం–2024'ను రాష్ట్రంలోనూ అమలు



చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ–63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ–64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

## ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

**మొదటిపేజీ తరువాయి –** ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్–హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు.హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది.హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు ఇవే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యుమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్–హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్‌కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్–హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్–హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు.నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ)గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది.న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

## ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

**మొదటిపేజీ తరువాయి –** కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు. "కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు.అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి – న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి – అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారీ అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!

**మొదటిపేజీ తరువాయి –** ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24 గంటలూ నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం–1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ వెసులుబాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించింది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది.అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉండగా, అదే సమయంలో ఉద్యోగుల హక్కులకు భద్రత కల్పించడం గమనార్హం.

## వారిని అంతం చేస్తున్నా

**మొదటిపేజీ తరువాయి –** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ–135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే

**మొదటిపేజీ తరువాయి –** ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

## గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి –** సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**మొదటిపేజీ తరువాయి –** మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు.మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## అమిత్ షాకు కేటీఆర్ లేఖ



**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు.తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 03 - 2026

# టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సహకారంతో

## ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు భూమి పూజ



**కోసిగి.మార్చి13 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం)** :మేజర్ గ్రామ పంచాయతి కోసిగిలోని మూడవ వార్డు ఎస్సి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కొరకు సర్పంచ్ కుమారి అయ్యమ్మ శుక్రవారం నాడు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రాలయం టిడిపి ఇంచార్జి చీ రాఘవేంద్రరెడ్డి సహకారం తో జి రామ్ జి నిధులకింద 6లక్షల 40వేల రూపాయల తో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి నట్లు ఆమె తెలిపారు. అయితే కుమారి అయ్యమ్మ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో డ్రైనేజ్, రోడ్లు, అవసరం ఉన్నచోట అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. గతంలో కూడా ఎస్సీ కాలనీలో పనిచోట్ల ఇరువైపుల డ్రైనేజీలు సిసి రోడ్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మాణిక్యరాజు, పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి ఆర్లబండ సొసైటీ అధ్యక్షుడు అయ్యన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సారెడ్డి తోవి రామకృష్ణ, అరివిలి వీరేశ్ యువనాయకుడు రాజేష్ ,వక్రాని వెంకటేష్ , సొట్టయ్య హోలాగుంద కోసిగయ్య, సాతనూరు కోసిగయ్య, ఊసేని పంచాయతీ సిబ్బంది తో పాటు పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఏపీ పారిశ్రామిక విధానాలను పక్క రాష్ట్రాల

## ప్రజాప్రతినిధులు మెచ్చుకుంటున్నారు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** :ఏపీలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాలను పక్క రాష్ట్రాల ప్రజాప్రతినిధులు సైతం మెచ్చుకుంటున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రజా ప్రతినిధులతో కలిసి తాను కూడా పాల్గొన్నట్లు టీజీ భరత్ చెప్పారు. అయితే ఆ సందర్భంగా ఏపీలో పెట్టు బడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిం చినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రాంతం లో పెట్టుబడులు పెట్టాలన్నా, ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలన్నా సింగిల్ విండో ద్వారా వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని వివరించినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని అక్కడ ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎం.ఎల్.సి డి.ఎస్ అరుణ్ కర్ణాటకలో విధాన పరిషత్‌లో ప్రస్తావించారని టీజీ భరత్ చెప్పారు. అయితే కర్ణాటకలో పారిశ్రామికవేత్తలకు అనుకూల పరిస్థితులు లేవని ఆ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులే స్వయంగా చెబుతున్నారన్నారు. విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీలో పారిశ్రామికవేత్తలకు పూర్తి అనుకూలమైన వాతావరణం కల్పించామన్నారు. ఏపీలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీజీ భరత్ పేర్కొన్నారు.

# ఏ ఐ టి యు సి 21వ మహాసభల కరపత్రాలు విడుదల




**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** : మార్చి 28, 29, 30 తేదీలలో ఆలూరు లో జరుగు ఏఐటీయూసీ కర్నూలు జిల్లా 21వ మహాసభల కరపత్రాలను నేడు కర్నూల్ లోని ఐటియుసి జిల్లా కార్యాలయంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు బి. గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ము నెప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు జి.చంద్రశేఖర్ బి. వెంకటేష్, హోటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం, టి.రామాంజనేయులు, మృతుజా నరసింహులు,డి. నల్లన్న,రవి,ఆటో యూనియన్ నాయకులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ , ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. వెంకటసుబ్బయ్య , రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ గారు, చేతివృత్తుదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతో కార్మికుల హక్కులకై ఉద్యమించడానికి భవిష్యత్ కార్యాచరణ పై హాజరై ప్రసంగిస్తారని వారు తెలిపారు. ఈనెల 28వ తేదీ ఆలూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి ఉదయం 10 గంటలకు వేలాది మంది కార్మికుల తో మహా ప్రదర్శన ప్రారంభమై పాత బస్టాండ్ లో 11 గంటలకు జరుగు బహిరంగ సభ నిర్వహించబడుతుందని ఈ యొక్క ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయడానికి జిల్లాలోని ఉద్యోగులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలేవీ

## కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష



**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** :కర్నూలు నగరంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ప్రశ్నించారు. శుక్రవారం ఆయన నగరానికి తాగునీరు అందించే పంపిణీ వ్యవస్థను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, మునగాలపాడు నీటి శుద్ధి కేంద్రం, సుంకేసుల జలాశయం, గాజులదిన్నె రిజర్వాయర్ ప్రాజెక్టులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. నీటి లభ్యత, వేసవి తాగునీటి సరఫరా ప్రణాళికలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. నగరానికి సగటున 100 ఎంఎల్‌డీ తాగునీరు అవసరమవుతుందని తెలిపారు. నగరానికి నీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం 0.5 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.1 టీఎంసీ మాత్రమే నిల్వ ఉన్నదని, అది గరిష్టంగా మరో 15 రోజులకు మాత్రమే సరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లుగా సుంకేసుల నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకు పైప్‌లైన్ నిర్మాణం పూర్తికాక జాప్యం జరుగుతోందని అన్నారు.తుంగభద్ర డ్యాంలో 4 టీఎంసీల నీటి కోట ఉన్నప్పటికీ ప్రస్తుతం డ్యాం గేట్ల మరమ్మత్తుల కారణంగా నీటి విడుదలపై అనిశ్చితి నెలకొన్నదని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పక్కన కార్పొరేషన్‌కు చెందిన ఖాళీగా ఉన్న 135 ఎకరాల్లో మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి కనీసం ఆరు నెలలకు సరిపడా తాగునీటిని నిల్వ ఉంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కేపియస్ సభ్యులు హరినాథ్, రామాంజనేయులు, ధర్మరాజు, భార్గవ్, ప్రేమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి తెలుగు మహిళా కవయిత్రిగా ప్రసిద్ధి చెందిన మొల్ల జయంతి

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి నివాళులు





**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** : శుక్రవారం నాడు మొల్ల జయంతి సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరిమాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలో మొల్ల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహిళలు కూడా సాహిత్య రంగంలో ప్రతిభ చూపగలరని ఎంతో కాలం క్రితమే మొల్ల నిరూపించారని అన్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించిందని తెలిపారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి మొల్ల జీవితం ప్రేరణగా నిలుస్తుందని, వారి సాహిత్య వారసత్వాన్ని ప్రతి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎస్వీ విజయ మనోహరి అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా విభాగం సభ్యులు మరియు అభిమానులు పాల్గొని మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు,టౌన్ ప్రెసిడెంట్ బబ్లూ, కార్పొరేటర్ మునియమ్మ,మంగమ్మ,కమల,గద్దరాశేఖర, మల్లి,కంటు,గ్యాస్ సీను,భాష,రాము,శ్రవణ్, పూర్ణ, భరత, నాగరాజు, కన్నా తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కేంద్ర బిందువు ఆర్ యూ రిజిస్ట్రార్ ను తొలగించాలి

## అన్యాక్రాంతమైన యూనివర్సిటీ భూములను కాపాడండి

## ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎ,పిడిఎస్ యు, ఆర్ పిఎస్ఎఫ్ సంఘాల నాయకుల విజ్ఞప్తి

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప కు వినతి పత్రం అందజేత




**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** :రాయలసీమ యూనివర్సిటీ ఖజానాకు కన్నం వేసిన రిజిస్ట్రార్ ను తొలగించి, అన్యాక్రాంతమైన యూనివర్సిటీ భూములను కాపాడాలని ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, ,పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు కె.రమణ, ఆర్ పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.నాగరాజు లు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అనేక అవినీతి,అక్రమాలకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఇచ్చే నిధులు దుర్వినియోగానికి పాల్పడుతూ, సొంత ఖాతాల్లోకి నిధులు మళ్లించుకుంటూ, విద్యార్థులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడు లేని విధంగా పరీక్షల విభాగాలకు వచ్చిన నిధులను ఉద్యోగులకు చెల్లిస్తున్నారని, యూనివర్సిటీ కి ప్రధాన అకౌంట్లో ఉన్న ఖజానాను ఖాళీ చేసి, అప్పుల ఊబిలోకి నెట్టి, యూనివర్సిటీ పరిధిలో ఉండే ఫీజులను పెంచి, విద్యార్థులపై అదనపు భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల విషయంలో రిజిస్ట్రార్ ఏకచక్రాధిపత్యం చలాయిస్తూ, ముడుపులు ముట్టజెప్పితే, అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. నామమాత్రపు కమిటీలను నియమించి, కమిటీ సభ్యులుగా ఉన్నవాళ్లు అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి చేయడం జరుగుతుందని అన్నారు. రిజిస్ట్రార్ వ్యవహారంపై వీసీకి ఫిర్యాదు చేసిన కేవలం మాటలు చెప్పి, సాగనంపుతున్నారని అన్నారు. రిజిస్ట్రార్ బాధ్యతల నాటి నుంచి అనేక అవినీతి, అక్రమాలకు తెర లేపారని అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ కి సంబంధించిన భూములు ఎకరాల్లో అన్యాక్రాంతమయ్యాయని, సారీ వాటి పరిరక్షణకు వర్సిటీ అధికారులు ఎలాంటి చేపట్టడం చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు యదేచ్చగా కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారని అన్నారు. కావున ఇప్పటికైనా వీసీ మరియు ఉన్నతాధికారులు స్పందించి, రిజిస్ట్రార్ ను తక్షణమే తొలగించాలని, అన్యాక్రాంతమైన యూనివర్సిటీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్సిటీ బందుకు పిలుపు నిచ్చి,తరగతులను బహిష్కరించి, పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని వారు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎ,పిడిఎస్ యు, ఆర్ పిఎస్ఎఫ్ సంఘాల నాయకులహరీష్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బి క్రాంతి నాయుడు





**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** : పవిత్రమైన రమజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా మైనారిటీ విభాగం పర్యవేక్షణలో శుక్రవారం కర్నూలులోని కళా వెంకట్రావు భవన్‌లో (జిల్లా కాంగ్రెస్ కార్యాలయం) ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, న్యాయవాది బోయ క్రాంతి నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి, సోదరభావానికి మరియు పరస్పర గౌరవానికి ప్రతీకలని తెలిపారు. రమజాన్ మాసం సహనం, సేవా భావం, దానం మరియు మానవత్వం వంటి గొప్ప విలువలను మనకు గుర్తుచేస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే సమాజంలో అన్ని మతాల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం మరియు స్నేహభావాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంఘర్షణల నేపథ్యంలో శాంతి, సహనం మరియు మానవత్వం మరింత ప్రాధాన్యత పొందాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో మరియు రాష్ట్రంలో మైనారిటీ సమాజ అభివృద్ధికి విద్య, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరమని ఆయన తెలిపారు. ముఖ్యంగా మైనారిటీ విద్యార్థులకు విద్యా అవకాశాల విస్తరణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఇండియా కూటమి నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మరియు మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ యన్ సి బజారన్న, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, కేకేసి సెల్ చైర్మన్ ఎజాజ్ అహ్మద్ కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ రియాజుద్దీన్, మహమ్మద్ నూర్, వశీ భాష, రాఘవేందర్ రెడ్డి మొదలగు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆఫ్ మూన్, డాట్ ప్రూఫింగ్ మోడల్స్ వేసిన ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారులు






**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** :గోనెగండ్ల మండలంలోని లింగం దిన్నె గ్రామంలో ప్రస్తుతం రైతులు వ్యవసాయం పై అధిక పెట్టుబడులు పెట్టి దిగుబడులు పొందలేక, గిట్టుబాటు ధరలు లేక చాలామంది రైతులు పొలాలను బీడు భూములు గా మిగుల్చుతున్నారు,వలసబాట పడుతున్నారు.ప్రస్తుతం సాగు భూమి: 30 నుండి 40% ఉండగా బీడుభూములు: 60-70% గా ఉంటున్నాయిఎల్-నినో పసిఫిక్ మహాసముద్రం లో సంభవించే మార్పు దీని ప్రభావం వలన హై ఇంటెన్సి సిటీ రైన్ ఫాల్ ఏర్పడే ప్రభావం ఉన్నది ఇటువంటి సమయం లో భూమి కోతకు గురికాకుండా సాంద్రతను కోల్పోకుండా బీడు భూములో డీ ఆర్ పి ఎం మోడల్ ఇంప్లిమెంట్ చేసి బెట్టకు తట్టుకునే పంటలను సజ్జ గోరుచిక్కుడు అలసంద అనప ఆముదం వంగ మొదలగు పంటలను ఎన్నుకొని ఆదాయం తీసుకుంటూ భూమిని ఎండ మరియు హై ఇంటెన్సిటీ రైన్ ఫాల్ నుండి కాపాడు కోవాలనే ముఖ్య ఉద్దేశ్యం తో గోనెగండ్ల మండల్ ప్రకృతివ్యవసాయంసిబ్బంది రైతులకు లింగం దిన్నె గ్రామం రైతు ప్రకాశ్ రెడ్డి పొలంలో శు క్రవారం డెమో చూపించడం జరిగింది. ఈ మోడల్స్ వేయడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వర్షాలు కురిస్తే వీలైనంత ఎక్కువ నీటిని భూమిలోకి ఇంకేటట్లుగా ఉపయోగ పడటమే కాక, ఎల్లప్పుడూ తేమను నిలిపి ఉంచుతుందని, భూసారం కొట్టుకుపోకుండా కాపాడుతుందని, ఎక్కువ వర్షాలు కురిసినప్పుడు మొక్కల మధ్య నీరు నిలబడకుండా చేస్తుంది ఎన్ ఎఫ్ ఏ మల్లికార్జున, యం టి లత, వెంకటేశ్వర్లు, డీ ఎం ఎం టీ ఉరుకుంద, కౌలుట్ల తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గ్రామం లో కనీసం ఒక రైతును గుర్తించి బీడు భూములో లేదా వర్షాధార పండ్ల మొక్కలు వేసిన చోట మోడల్ వేయించడం ద్వారా రైతులు బీడు భూములను సాగు భూములు గా మార్చడానికి అవకాశం ఉన్నదన్నారు గ్రామాల్లో ఉన్న రైతులందరికీ మన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి తెలపాలన్నారు నేలను సారవంతం చేసేందుకు ఘనజీవామృతం ద్రవజీవామృతంలతో పాటు నవధాన్యాలను వేసుకోవాలి అని తెలిపారు. ముఖ్యంగా రైతులందరూ ఒకే రకమైన పంట కాకుండా ఎక్కువ రకాల అంతర పంటను, పురుగు తెగుళ్ల నివారణకు కషాయాలను, ద్రావణాలను ఉపయోగించుకునే విధంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలను సాగు చేసి పండించినటువంటి ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బ తినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించే దిశగా కృషి చేయాలని వారు తెలిపారు. ప్రకృతికి, పర్యావ రణానికి, ప్రజారోగ్యానికి హాని చెయ్యని ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మశ్రీ, రాముడు, ఈరన్న , మాబు హుస్సేన్, మల్లికార్జున, వేణుగోపాల్ విశ్వనాథ్ మరియు టి ఐ సి ర్ పి లు శిరోమణి అనంతలక్ష్మి పెద్దక్క ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిగా ఎంపిక అమ్మవారికి మొక్కుబడి చెల్లించిన

## రేమట రాజశేఖర్



**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు** :కోడుమూరు పట్టణానికి చెందిన రేమట రాజశేఖర్ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయుడిగా ఎంపికై, ప్రస్తుతం బండపల్లి లోని పాఠశాలలో పనిచేస్తున్న దాత రేమట రాజశేఖర్ అనే యువకుడు అమ్మవారికి మొక్కుబడిగా తన రెండు నెలల జీతంతో సుమారు రూ.80,000ల విలువైన వంట సామాగ్రిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.శుక్రవారం ఉదయం కోడుమూరు పట్టణ శివారులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీ వల్లెలాంబ దేవి అమ్మవారి ఆలయంలో పెద్ద బోయగేరికి చెందిన బాలు,రంగమ్మ దంపతుల కుమారుడు ఉపాధ్యాయుడు బి రాజశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి,అమ్మవారి ఆలయంకు ఈ వంట సామాగ్రిని భక్తిశ్రద్ధలతో ఆలయ నిర్వాహకులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు రాజశేఖర్‌ను అభినందించారు.అమ్మవారి కృపతో ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో మొక్కుబడి చెల్లించానని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగన్న తాత, ఆలయ కమిటీ సభ్యులు బి రమేష్ నాయుడు, బి కృష్ణారెడ్డి, సాలప్ప, లోకేష్, గుంటెప్ప తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**కేపిహెచ్బి కాలనీ ఐదవ పేజ్ 9 యాడ్స్ వస్త్రాలయం నందు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ ఇన్స్టిట్యూట్ వారి సౌజన్యంతో క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది స్త్రీ పురుషులు వచ్చి స్క్రీనింగ్ చేయించుకోవడం జరిగింది. ఇలాంటి ప్రజా హితమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 9 యాడ్ యజమాని లక్ష్మణ్ కు సాయిబాబు చౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలో క్యాన్సర్ మహమ్మారి పెరుగుతుందని, ప్లాస్టిక్ ఆధారిత ఆహారాన్ని ప్రజలు ఎక్కువగా తీసుకుంటున్నారని దానివల్ల క్యాన్సర్ రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్యాన్సర్ భయముతో కాకుండా బాధ్యతతో స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా ఈ క్యాన్సర్ ని అరికట్టవచ్చుని మందలపు సాయిబాబు చౌదరి తెలియజేశారు. అదే విధంగా శనివారం నాడు గోపాల్ నగర్ వెస్టన్ ఫీల్డ్ స్కూల్లో ఉదయం 9 గంటల నుండి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయబడుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజలకు బసవతారకం హాస్పటల్ యాజమాన్యం నందమూరి బాలకృష్ణ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, డాక్టర్ బిందు, శ్రవణ్ కుమారి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ అబ్దుల్, డాక్టర్ అభిబ, లైన్స్ రేఖ, సత్య, రత్నాకర్, నవీన్, త్రినాధ్, వీరన్న బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**కూకట్ పల్లి, కేపీహెచ్బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు క్యాంప్ కార్యాలయంలో కూకట్పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మందడి శ్రీనివాసరావు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో దూసుకెళ్తూ విజయం సాధిస్తున్నారని, వారు అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు వెళుతూ అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మహిళా మీనాక్షి కి న్యాయం చేసిన రవి



**సూర్య ఉదయం ప్రతినిధి, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చింతల్ వెంకన్న కాలేజీ లో రిసెప్షన్ గా పనిచేస్తున్న మీనాక్షి, గత కొన్ని నెలలు నుంచి పని చేస్తుంది. కొన్ని అనివార్య కారణాలవల్ల మీనాక్షి కి రావాల్సిన వేతనం రెండు నెలల 20 రోజుల వేతనం మొత్తం 48000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి కాలేజీ యాజమాన్యం ఇవ్వకపోవడంతో పని మానేయడం జరిగింది. జరిగిన అన్యాయాన్ని బిఆర్టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ని కలిసి జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన వెంకన్న కాలేజ్ మేనేజ్మెంట్ తో పలుమార్లు చర్చించి మీనాక్షి కి రావలసిన వేతనం 48000/- వేల రూపాయలు మొత్తం ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ కా తోఫా కానుకలను అందించిన బండి రమేష్




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**ముస్లిం మైనార్టీల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈద్ కా తోఫా కానుకను శుక్రవారం మోతీనగర్ బబ్బుగూడలోని ముస్లిం మహిళలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతియుత వాతావరణంలో ప్రజల అందరితో కలిసి రంజాన్ ఉత్సవాన్ని జరుపుకుంటున్న ముస్లిం సోదరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి రాఘవేందర్, మజీద్ కమిటీ సభ్యులు, ఇమ్రాన్, ఇస్మాయిల్, సలీం, నయీం, బకరం బుచ్చయ్య, సుదాకర్ రెడ్డి, సలీం, రాజేష్, శ్రీను, ఇర్ఫాన్, వసీం, గోపాల్ చౌదరి, కమ్మర్ ఉద్దీన్, ఆనంద్ రెడ్డి, కోటిరెడ్డి, గోపాల్ చౌదరి వెంకటేష్ గౌడ్, షకీర్, రంగప్ప, కురువ రాజు, ప్రసాద్, శివ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ.. కార్యక్రమం సక్సెస్

## రైతుల ఖాతాలోకి హార్దిక సహాయం

**సూర్య ఉదయం ప్రతినిధి :** పెద్దకడబూరు రైతన్నలకు ఇచ్చిన హామీని నిలుపెట్టుకున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి అన్నారు అనంతరం స్థానిక చంద్రమ్మ భవనంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు, అనంతరం నేతలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతులకు ముఖ్య గమనిక. అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని, కేంద్ర ప్రభుత్వం పథకమైన పీఎం కిసాన్ యోజన తో కలిపి అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన పేరుతో ప్రతి ఏటా ఏపీలోని అర్హులైన రైతులకు 20 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14000, పీఎం కిసాన్ యోజన కింద రూ.6000 అందిస్తున్నారు. మొత్తం మూడు విడతల్లో ఈ నిధులను రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే





పీఎం కిసాన్ యోజన 22వ విడత నిధుల విడుదలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. మార్చి 13వ తేదీన పీఎం కిసాన్ యోజన 22వ విడత నిధులు విడుదల చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది, రాబోయే రోజుల్లో సూపర్ సిక్స్ పథకాలను మరో అడుగు ప్రభుత్వం చేపడుతుందని అందుకు భిన్నంగా కార్యకర్తలలో ఎలాంటి విభేదాలు లేకుండగా రాబోయే స్థానిక ఎన్నికలలో గ్రామాలలో టిడిపి జెండా ఎగరాలని కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఇంచార్జ్ రాఘవేందర్ రెడ్డి కార్యకర్తలకు భరోసా కల్పించారు,ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు వరప్రసాద్, సుచరిత, గణేష్, టిడిపి నాయకులు సూసైడ్ చైర్మన్లు మీసేవ ఆంజనేయ, కందనాతి నరసప్ప, ఆశీర్వాదం, మల్లికార్జున, భాష, విజయ్ కుమార్, బసల దొడ్డి ఈరన్న, వాల్మీకి అంజి, కౌతాళం సురేష్ నాయుడు, ముత్తిరెడ్డి, రామ్ రెడ్డి,నాగేంద్ర, కేశవ, ఆదాము అధిక సంఖ్యలో కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

# ఏపీ రైతులకు ఉగాది కానుక మూడో విడత 'అన్నదాత సుఖీభవ


### పీఎం కిసాన్' నిధులు విడుదల

### కూటమి ప్రభుత్వ ఉగాది కానుకగా మూడో విడత నిధుల విడుదల

### 46.85 లక్షలమంది రైతులకు రూ.6 వేల చొప్పున జమ

### గన్నవరంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు

వ్యవసాయంలో రైతులకు సాంకేతిక సహకారం అందించేలా త్వరలోనే ఏఐ ఆగ్రోనమిస్ట్‌ను రాష్ట్రమంతటా అందుబాటులోకి తెస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పెట్టుబడి సాయం కింద అన్నదాత- సుఖీభవ నిధులను కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో నేడు విడుదల చేశారు. 46లక్షల 85వేల మంది రైతుల ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమ చేసినట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. యుద్ధం వల్ల కోడిగుడ్లు, సీమ అరటి ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయాయన్నారు. రాష్ట్రాభివృద్ధిలో రైతులది కీలక పాత్ర అని అన్నారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వాడేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. సాగు పద్ధతుల్లో ఆధునికీకరణ తెస్తున్నామని చెప్పారు.ఏపీ రైతులకు ఉగాది కానుక - మూడో విడత 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' నిధులు విడుదల (జుుఎ)24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ : "రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పంటలకు సమయానికి సాగునీరు అందిస్తున్నాం. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపాం. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఆ రోజు చెప్పాం. మీరు అండగా నిలిచారు. ఈ 20 నెలల్లో ఒక్కో అడుగు ముందుకేశాం, సమస్యలు పరిష్కరిస్తున్నాం. అనేక సమస్యలున్నా రైతుల కోసం అనేక పనులు చేశాం. ధాన్యం సేకరించాక 24 గంటల్లో మీ ఖాతాల్లో నగదు జమ చేశాం. రైతు ఇబ్బంది పడకూడదనే అనేక రకాలుగా ఆదుకుంటున్నాం. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ.6 వేలు ఇస్తున్నాం. రైతుల ఖాతాల్లో ఏటా రూ.20వేలు జమ చేస్తున్నాం. కేంద్రం రూ.6వేలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోంది" అని చంద్రబాబు తెలిపారు.ఆ బాధ్యత సాగునీటి సంఘాలదే : " ఆక్వా కల్చర్ రైతులకు రాయితీ కింద రూ.810 కోట్లు ఇచ్చాం. రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇచ్చాం. డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నాం. చెరువులు బాగు చేసి నీరు నింపేలా చర్యలు తీసుకున్నాం. ఖరీఫ్, రబీకి వాడుకున్నా ఇంకా చెరువుల్లో నీళ్లున్నాయి. మేం చేపట్టిన చర్యలతో భూగర్భజలాలు పెరిగాయి. కాలువల్లో పూడిక తీయాలని, డ్రెయిన్లు బాగు చేయాలని ఆదేశించాం. నీటి భద్రత ఇచ్చే బాధ్యత సాగునీటి సంఘాలదే. భూగర్భ జలాలు పెంచాలి. చివరి భూములకూ నీళ్లు ఇవ్వాలి.గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం. కృష్ణా డెల్టా మొత్తం సస్యశ్యామలం చేస్తాం. రైతుల ఇళ్ల వద్దకు వెళ్తాం, పంటలపై అవగాహన కల్పిస్తాం. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరిన్ని రావాలి. గన్నవరం విమానాశ్రయం నుంచి విదేశాలకు ఎగుమతులు పెరగాలి. ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని




చంద్రబాబు అన్నారు." రైతుల ఇళ్ల వద్దకు వెళ్తాం, పంటలపై అవగాహన కల్పిస్తాం. ఇప్పుడు అన్నం తినేవారు తగ్గిపోతున్నారు, రైతులు గమనించాలి. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తాం. నూజివీడు మామిడి, అరకు కాఫీ, గుంటూరు మిరప చాలా ప్రసిద్ధి. ఏలూరు సమీపంలో 500 ఎకరాల్లో కోకో సిటీ తెస్తున్నాం. ఏ పంటలు వేయాలో రైతులు కలిసి చర్చించుకోవాలి. ప్రతిచోటా భూసార పరీక్షలు చేయిస్తున్నాం. రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలు చెబుతున్నాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరిన్ని రావాలి. గన్నవరం విమానాశ్రయం నుంచి విదేశాలకు ఎగుమతులు పెరగాలి. ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గల్ఫ్ యుద్ధం వల్ల రాయలసీమ నుంచి అరటి ఎగుమతి ఆగింది." - సీఎం చంద్రబాబువారు రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందా? : వైఎస్సార్సీపీ వాళ్లు చేసిన పాపాలు గురించి మాట్లాడితే ప్రజలకు వాళ్ల అసలు స్వరూపం బయటపడుతుందనే భయంతో కోర్టులకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు దుయ్యబట్టారు. అలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందా? అని నిలదీశారు. లడ్డూ అంశంపై ఎవరూ మాట్లాడకూడదని సుప్రీంకు వెళ్లారని మండిపడ్డారు. నాడు వివేకా హత్య విషయంలోనూ, చెల్లెలు సునీతారెడ్డిని కూడా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికలయ్యాక కోర్టుకు వెళ్లి వివేకా హత్యపై ఎవరూ మాట్లాడకూడదని గ్యాగ్ ఆర్డర్ తెచ్చారని చంద్రబాబు తెలిపారు.ఇప్పుడూ కల్తీ నెయ్యితో లడ్డూను అపవిత్రం చేసి ఎవరూ మాట్లాడకూడదని కోర్టుకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఉండే ఎవరైనా పద్ధతి ప్రకారం పని చేయాలని హితవుపలికారు. తాను హిందువును హిందూ మతం పాటిస్తానని, ముస్లింల సాంప్రదాయాలను, క్రిస్టియన్లను, చర్చిలను గౌరవిస్తానని తెలిపారు. హిందూ దేవాలయాల పవిత్ర కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అమరావతిలో బిట్స్ పిలానీ 'ఏఐ ప్లస్ క్యాంపస్'

### నిర్మాణ ప్లాన్లు పరిశీలించిన మంత్రి లోకేశ్

### అమరావతిలో బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లు పరిశీలించిన మంత్రి లోకేశ్

### లోకేష్‌ను కలిసి క్యాంపస్ ప్లాన్లు చూపించిన బిట్స్ పిలానీ ప్రతినిధులు


### క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్ కోర్సులు ఉంటాయన్న ప్రతినిధులు




అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బిట్స్ పిలాని ఏఐ ప్లస్ క్యాంపస్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను కలిసి బిట్స్ ఏఐ క్యాంపస్ ప్లాన్లను ప్రదర్శించారు. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు అమరావతి క్యాంపస్‌లో ఉంటాయని ప్రతినిధులు తెలిపారు.రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెడతామని చెప్పారు. సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామన్నారు. అమరావతి బిట్స్ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని వెల్లడించారు.మంత్రి లోకేశ్ సంతృప్తి : అధునాతన సాంకేతికలతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు కూడా ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బిట్స్ ప్రతినిధులు తెలిపారు. బిట్స్ నిర్మాణ ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు.బిట్స్ పిలాని ప్రతినిధులు అంతకుముందు మంత్రి నారాయణను కలిశారు. అమరావతి క్యాంపస్‌లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వివరించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని మంత్రికి తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కనే 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణం కానుంది.7000 మంది విద్యార్థులకు అవకాశం : అమరావతిలో ఏఐ ప్లస్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్-బిట్స్ విశ్వవిద్యాలయ కులపతి, పారిశ్రామికవేత్త కుమారమంగళం బిర్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 7000 మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా కేంద్రాన్ని తీర్చిదిద్దుతామని, 2027 నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని తెలిపారు. అమరావతి క్యాంపస్‌ను ఆధునిక సాంకేతిక విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ, డేటాసైన్స్, రోబోటిక్స్, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులకు ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు.రూ.1,000 కోట్ల పెట్టుబడులు : స్మార్ట్, సుస్థిర మౌలిక సౌకర్యాలతో 2 దశల్లో 7000 మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా కేంద్రాన్ని రూపొందిస్తామని కుమారమంగళం బిర్లా అన్నారు. అమరావతిలో వచ్చే 5 ఏళ్లలో 1000 కోట్ల రూపాయల పెట్టుబడి పెడతామని ప్రకటించారు. అమరావతిలో బిట్స్ క్యాంపస్ ఉండాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని వెల్లడించిన కుమారమంగళం బిర్లా తక్కువ ధరకే భూమిలిచ్చారని తెలిపారు. అమరావతి క్యాంపస్ సీఎం దార్శనికతను ప్రతిబింబించేలా ఉంటుందని అన్నారు. గ్రీన్ బిల్డింగ్స్, పునరుద్పాదక విద్యుత్ విధానాలతో నిర్మాణాలు చేస్తామని పేర్కొన్నారు.70 ఎకరాలు కేటాయింపు : బిట్స్ అమరావతి క్యాంపస్ ఏర్పాటుకు సీఆర్‌డీఏ 70 ఎకరాలు కేటాయించింది. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో స్థలం కావాలని బిట్స్ కోరింది. తమ సంస్థ భవనాలనూ ఆలయ నమూనాలో నిర్మిస్తామని తెలిపింది. దీంతో వారు కోరిన ప్రాంతంలోనే ప్రభుత్వం భూములు కేటాయించింది. ఇటీవల సీఎం చంద్రబాబు వద్ద కూడా దీనిపై చర్చ జరిగింది. బిట్స్ క్యాంపస్ నమూనాలను ఆయన పరిశీలించారు.

# పవన్ కల్యాణ్ క్యాబినెట్ సమావేశానికి

### హాజరుకాకపోవడంపై రోజా స్పందన




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని వైసీపీ నేత రోజా తీవ్రంగా విమర్శించారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశం ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోయినా, చంద్రబాబు, పవన్‌లకు మాత్రం గొప్ప లబ్ధి చేకూర్చిందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రజల కంటే సొంత ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆమె సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు."ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశాన్ని చూశాక, ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తోందో నాకు స్పష్టంగా అర్థమైంది. రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం కాకుండా, కేవలం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ సమావేశం జరిగిందా అనిపిస్తోంది.కీలకమైన ప్రభుత్వ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు రాలేదు. ఆయన తన కొత్త సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' నిర్మాణ పనుల్లో బిజీగా ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే, అదే సమయంలో ఆయన సినిమాకు బెనిఫిట్ షోలు వేసుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం నన్ను ఆశ్చర్యపరిచింది. మార్చి 19 నుంచి ఉదయం 4 గంటలకే షోలు వేసుకునేందుకు, టికెట్ ధరను రూ.500 వరకు అమ్ముకునేందుకు అనుమతులు ఇచ్చారు. అంతేకాదు, 10 రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 పెంచుకోవచ్చని కూడా ఉత్తర్వులిచ్చారు.మరోవైపు, పవన్ గైర్హాజరును ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకే మరో ఆరుగురు మంత్రులు కూడా సమావేశానికి రాలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రజలే ఆలోచించుకోవాలి" అని రోజా తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ

### కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి




**సూర్య ఉదయం ప్రతినిధి కర్నూలు :** పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం కింద మూడవ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంలో సి.బెళగల్ టౌన్ లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలవడానికి కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడం జరిగిందని తెలిపారు.రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి బాట వేస్తుందని పేర్కొంటూ, రైతులు బలంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. మొత్తం మీద 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 8985 కోట్ల రూపాయలను సుమారు 46 లక్షల రైతులకు మూడు విడతలుగా అందిచడం జరిగింది అన్నారు. ముఖ్యంగా కోడుమూరు నియోజవర్గానికి 35052 రైతులకి సుమారు 19.72 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీనియర్ నాయకులు కోన రామ కిషోర్ నివాళులర్పించిన

### సతీష్ రెడ్డి




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోన రామ కిషోర్ 57వ జయంతి సందర్భంగా కెపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో కిషోర్ అన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులతో కలిసి కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి నివాళు అర్పించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ కిషోర్ నేను రాజకీయాల్లో వచ్చిన కొత్తలో నన్ను ఎంతో ప్రోత్సహించి రాజకీయ ఓనమాలు నేర్పారు. అందరికి అండగా ఉంటూ సేవ కార్యక్రమాల్లో పాల్గొనే వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కోన ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు హెచ్ ఎన్ మూర్తి , రంగమోహన్, గిరి నాయుడు, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, కిషోర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## జేఎన్టియూ లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం






**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక కార్యక్రమం లో భాగంగా, జేఎన్టియూ పరిధిలోని ఖజజూుఎ యొక్క జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో, ఖజజూుఎ ప్రాంగణంలోని 'గౌతమి ౹ా+ హాస్టల్' ఆవరణలో ఒక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించబడింది. ఈ పారిశుధ్య కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి స్వయంగా పాల్గొని, ఇటువంటి కార్యక్రమాలు క్యాంపస్ జీవనంలో ఒక నిత్యకృత్యంగా మారాలని అభిప్రాయపడ్డారు. ఈ పారిశుధ్య కార్యక్రమంలో ఖజజూుఎ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రఘురామ్, చీూా కళాశాల విభాగ సమన్వయకర్త డాక్టర్ ఎల్. సైదా నాయక్, అసోసియేట్ చీూా సమన్వయకర్త డాక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డితో పాటు హాస్టల్ వార్డెన్లు, హాస్టల్ విద్యార్థులు మరియు క్యాంపస్‌లోని స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం (రాజూవఎఋశ్రీ ఐతీఅజవ)లో భాగంగా, రేపు ఖజజూుఎ మరియు ఖజజువీ పరిధిలోని కాన్స్టిట్యూయెంట్ కళాశాలల్లో భారీ స్థాయి తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించబడనున్నాయి.

## ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన టిడిపి నేత ఈరన్న



**సూర్య ఉదయం ప్రతినిధి: పెద్దకడబూరు** మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం లకు మాజీ మండల అధ్యక్షులు గవిగట్టి ఈరన్న మరియు కుటుంబ సభ్యులు ముస్లింలంతా విందుకు ఏర్పాటు చేశారు, అనంతరం ముస్లింలు అందరూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని ఆశీర్వదించా లని కోరారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. శ్రీజన, ఐఏఎస్ ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మర్యాద పూర్వకముగా కలిసి కూకట్ పల్లి నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలనీ కోరారు. నియోజకవర్గం లో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. అలాగే కూకట్ పల్లి నల్లా చెరువు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడం జరిగింది. కానీ చెరువు దగ్గర పలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఇందులో భాగంగా మహిళలకు పురుషులకు చిన్న పిల్లల పార్కు, ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, యోగ, ఇండోర్ స్టేడియం, పార్కులో 30 బెంచీలు, లైబ్రరీ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే రామారావు నగర్ నాలా పనులు చేపట్టడం జరిగింది. ఇట్టి నాలాపై సుమారుగా 500 ఫీట్లు పనిచేయవలసిందే కావున నాలాపై స్లాబ్ ఏర్పాటుకి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సిందిగా కోరారు. అలాగే మూసాపేట చౌరస్తా నుండి ఆంజనేయ నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని మరియు బాలనగర్ గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజలకు ఉపయోగపడుతున్న రాజు కాలనీ కమ్యూనిటీ హాలు ఈఎస్ఐ డిస్పెన్సరీగా కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదు అని, స్థానిక పేదల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాలు ను ఈఎస్ఐ కి అప్పగించారు. ఏ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, పండాల సతీష్, మందాడి శ్రీనివాస రావు, సబిహా గౌసుద్దీన్, మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.


## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు



**కౌతాళం మార్చి13(సూర్య ఉదయం):-** కౌతాళం మండలం కేంద్రంలో టిడిపి సీనియర్ నాయకులు చెన్నబసప్ప ధని అధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపి అన్న దానం కార్యక్రమం నిర్వహించారు.అనంత రం ముస్లిం సోదరులు పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సన్మానించారు.ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

### ఏఐఎస్ఎఫ్




**కౌతాళంమార్చి13(సూర్యఉదయం):-**కౌతాళం మండల కేంద్రంలో 16వ తేదీ నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కౌతాళం మండల విద్యాశాఖ అధికారి శోభారాణికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఈరేష్ మండల కార్యదర్శి సాయి వర్మ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదవ తరగతి పరీక్షల సమయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలి అలాగే పరీక్షా గదుల్లో విద్యార్థులకు సరిపడా వెలుతురు ఉండాలని,ఫ్యాన్లు,విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని,గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కోసం పరీక్షా సమయాలకు అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడపాలి వారు విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యం కల్పించలేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అనిమేష్ నాయకులు రాము తేజు పాల్గొన్నారు.

సూర్యఉదయం
తెలుగు దిన పత్రిక
శనివారం 14 - 03 - 2026

# 'మహిళలను వేధించినందుకు మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాం

**వృద్ధులను భయపెడుతోన్న ఫోన్ కాల్**

**రాష్ట్రంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు**

**డిజిటల్ అరెస్ట్ల పేరుతో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు**

**మాయమాటలు చెప్పి రూ.కోట్లు కాజేస్తున్న వైనం**



ఈ నేపథ్యంలో డిజిటల్ అరెస్ట్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

డిజిటల్ యుగంలో టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అంతే వేగంతో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వాడకం పెరగడంతో కొందరు మోసగాళ్లు కొత్త తరహా పద్ధతులతో వృద్ధులను టార్గెట్ చేస్తున్నారు. ఒక చిన్న లింక్ ఓపెన్ చేసినా, ఓటీపీ చెప్పినా బ్యాంక్ ఖాతాలోంచి డబ్బులు లూటీ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటోంది.ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రశాంతమైన జీవితం. వారి జీవితాల్లో ఎటువంటి మచ్చ లేకుండా పనిచేసి రిటైర్డ్ అయ్యాక మిగిలిన జీవితం గడిపేస్తామని అనుకుంటారు. కానీ ఆ ఒక్క ఫోన్ వారిని భయందోళనకు గురిచేసింది. ప్రశాంతంగా ఉన్న వారి జీవితాల్లోకి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మహిళలను వేధిస్తున్నారని, ఆధార్ కార్డుతో లింక్ అయిన 2 మొబైల్ నంబర్‌లను ఉపయోగించి కాల్స్, మెసేజ్‌లు చేసినందుకు మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని చెప్పడంతో వాళ్లకు ఒక్కసారిగా గుండె పగిలినంత పనైపోతుంది.వృద్ధులకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మహిళలను వేధిస్తున్నారని, ఆధార్ కార్డుతో లింక్ అయిన 2 మొబైల్ నంబర్‌లను ఉపయోగించి మహిళలకు అభ్యంతరకరమైన కాల్స్, మెసేజ్‌లు చేసినందుకు మిమ్మల్ని అరెస్ట్ చేయబోతున్నామని చెబితే ఎలా ఉంటుంది. అసలే వృద్ధులు. పరువు పోతుందన్న భయంతో సైబర్ నేరగాళ్లకు అడిగినంతా ముట్టజెబుతున్నారు. బాధితుల్లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత న్యాయమూర్తులు, సైంటిస్టులు, బ్యాంకు మేనేజర్లు, డాక్టర్లు ఉండటం గమనార్హం. పోలీసులు, మీడియా చేస్తున్న అవగాహనతో కేసుల సంఖ్య తగ్గినా, ఒక్కో కేసులో సైబర్ నేరగాళ్లు రూ.కోట్లలో కాజేయడం కలకలం సృష్టిస్తోంది.

**సైబర్ నేరాలతో రూ.కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు :** సైబర్ నేరగాళ్లు దొరికిన ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలట్లేదు. వివిధ రకాల నేరాలతో రూ.కోట్లు కాజేస్తున్నారు. ప్రస్తుతం అధిక మొత్తంలో ఇన్వెస్ట్‌మెంట్ ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో పోతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధానంగా డిజిటల్ అరెస్ట్ కేసుల్లో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులే టార్గెట్‌గా నేరగాళ్లు రూ.కోట్లు కాజేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ రిటైర్డ్ జడ్జిని డిజిటల్ అరెస్టు పేరుతో రూ.1.66 కోట్లు దోచుకున్నారు. ఘటనపై 73 ఏళ్ల విశ్రాంత న్యాయమూర్తి మల్కాజ్‌గిరి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.గత నెల 23వ తేదీన గుర్తు తెలియని నంబర్ నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడిన రిటైర్డ్ జడ్జికి అవతలి వ్యక్తి తాను ఒక సీనియర్ సీబీఐ అధికారి అని, తన పేరు దీపక్ కుమార్ అని పరిచయం చేసుకున్నాడు. మీ ఆధార్ కార్డుతో లింక్ అయిన 2 మొబైల్ నంబర్‌లను ఉపయోగించి మహిళలకు అభ్యంతరకరమైన కాల్స్, మెసేజ్‌లు చేసేందుకు ఉపయోగిస్తున్నారని, ఈ వ్యవహారంపై బెంగళూరు ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని భయపెట్టాడు.

**జడ్జినే డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించిన మాయగాళ్లు :** ఆ కాల్‌లో మాట్లాడుతుండగానే మరో సైబర్ నేరగాడు కాన్ఫరెన్స్‌లో చేరాడు. అతడు తాను సీఐ గౌరవ్ సారథి అని చెప్పాడు. మానవ అక్రమ రవాణా కేసులో రిటైర్డ్ జడ్జి నిందితుడిగా ఉన్నట్లు ఆ రెండో సైబర్ నేరగాడు చెప్పాడు. ఈ మేరకు సుప్రీంకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు కూడా చెప్పాడు. అయితే ఈ విషయాన్ని ఫ్రెండ్స్, ఫ్యామిలీ సహా ఎవరికీ చెప్పొద్దని సైబర్ నేరగాళ్లు హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా, మనీలాండరింగ్, దొంగతనం కేసులు ఉన్నాయని బెదిరింపులకు దిగి, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వీడియో కాల్‌లో ఎటూ వెళ్లకుండా నిర్బంధించారు. అరెస్ట్ చేస్తారని భయపడిన ఆ రిటైర్డ్ జడ్జి పరువు, ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని భయపడి ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ మధ్య వారికి 1.66 కోట్లు బదిలీ చేశాడు.

**డిజిటల్ అరెస్టు అని చెప్పి రూ.7.12 కోట్లకు కుచ్చుటోపీ :** మరో కేసులో హైదరాబాద్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడికి వాట్సాప్ కాల్ వచ్చింది. మొదట కొరియర్ కంపెనీ ఉద్యోగిగా మాట్లాడారు. అతని పేరుతో డ్రగ్స్ ఉన్న పార్శిల్ విదేశాలకు వెళ్తుందని చెప్పారు. తర్వాత తాము పోలీసులమని చెప్పి వీడియో కాల్‌లో విచారణ ప్రారంభించారు. బాధితుడిని 'డిజిటల్ అరెస్ట్'లో ఉన్నట్టు చెప్పి మ్యూచువల్ ఫండ్స్, ఎఫ్‌డీలు బ్రేక్ చేయించి రూ.7.12 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మరో కేసులో నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగిని తాము కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులమని చెప్పి వీడియో కాల్‌లో నిర్బంధించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి చేసి రూ.59 లక్షలు మోసం చేశారు. ఈ కేసులో కాకినాడకు చెందిన ఇద్దరిని తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు.

**ఇలా చేయడం మేలు :** డిజిటల్ అరెస్ట్ పేరుతో చేస్తున్న సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వృద్ధులు తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటున్నారని పోలీసులు చెబుతున్నారు. తాను అరెస్ట్ అయినా ఫర్వాలేదని, బంధువులకు, పిల్లలకు చెబితే వారిని కూడా అరెస్ట్ చేస్తామని చెప్పారని, అందుకే ఎవరికీ చెప్పలేదని పోలీసుల ముందు వాపోతున్నారు. ఇలా ఇంట్లో ఎవరకీ చెప్పకుండా బాధితులు తమ జీవితకాలం సంపాదన మొత్తాన్ని అరెస్ట్, పరువు పోతుందనే భయంతో నేరగాళ్లకు ముట్టజెబుతున్నారని పోలీసులు చెబుతున్నారు. న్యాయ వ్యవస్థలో అసలు డిజిటల్ అరెస్ట్ అనే పదమే లేదని చెప్పారు. ఎవరైనా అలా చెప్పి వీడియో కాల్ చేస్తే మోసమని గ్రహించాలని సూచిస్తున్నారు.

# పదో తరగతి విద్యార్థులకు అలర్ట్

**హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్**

**పదో తరగతి విద్యార్థులకు అందుబాటులోకి సరికొత్త సౌకర్యం**

**పరీక్ష కేంద్రం రూట్ తెలుసుకోవడానికి క్యూ ఆర్ కోడ్**

**ఇబ్బందులను తొలగించేందుకు క్యూఆర్ కోడ్‌ను ముద్రణ**

**16 నుంచి పబ్లిక్ పరీక్షలు**



రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఈ సంవత్సరం సరికొత్త సౌకర్యాన్ని అందుబాటులోనికి తీసుకుని వచ్చింది. పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో విద్యార్థులు పడేటటువంటి ఇబ్బందులను తొలగించేందుకు హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది.అయితే దీనిని సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి ఏ విధంగా చేరుకోవాలి? పరీక్షకు వెళ్లేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలన్నీ స్పష్టంగా తెలుస్తాయి. అంతేకాకుండా పట్టణాలు, నగరాల్లో ఎక్కువ శాతం పరీక్ష కేంద్రాలు ఉండటంతో వాటిని అన్వేషించేందుకు విద్యార్థులు ఏ విధమైన ఏ విధమైన ఇబ్బందులు పడొద్దనే ధోరణిలో ఈ విధానాన్ని తీసుకువచ్చామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

**హాల్‌టికెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం:** విద్యార్థులకు అన్ని విధాలుగా అనువుగా ఉండేందుకు హాల్‌టికెట్‌పై పరీక్షల సమయానికి సంబంధించిన టైమ్‌టేబుల్‌ను సైతం ముద్రించామని ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రెండు పరీక్షల మధ్య సెలవులు వచ్చే విధంగా షెడ్యూల్‌ను రూపొందించారు. దీనికితోడు కేవలం హాల్‌టికెట్‌ను చూపించినట్లయితే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని కూడా కల్పించడం విశేషం. ప్రతి ఒక పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఉంటుంది. అయితే విద్యార్థులను 8:30 గంటల నుంచే పరీక్ష కేంద్ర ప్రాంగణంలోకి అనుమతిస్తారు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత సైతం అనుమతిస్తారు.

**26 జిల్లాల్లో ప్రత్యేక కేంద్రాలు:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి 13 వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇందుకు 26 జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటికి గాను ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనుండటం గమనార్హం. వీటికి క్యాంపు అధికారులుగా ఆయా జిల్లాల విద్యాధికారులు సైతం ఉంటారు. అదే విధంగా మూల్యాంకనం చేయనున్న ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు రోజుకు 40 చొప్పున జవాబుపత్రాలను అందిస్తారు.

**పరీక్షలకు సంబంధించిన వివరాలు:** అంతేకాకుండా మార్కుల లెక్కింపులో ఏ విధమైన తప్పులు దొర్లకుండా ఉండేందుకు ట్యాబుల్లో నమోదు చేసే విధానాన్ని తీసుకుని వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలను పరిశీలించినట్లయితే 6,40,916 గా ఉన్నారు. అదే విధంగా ఇందులోని బాలుర సంఖ్య 3,28,652 ఉండగా బాలికలు 3,12,264 గా ఉన్నారు. ఇక పరీక్ష కేంద్రాల విషయానికొస్తే 3,415 ఉండగా సమస్యాత్మక కేంద్రాలను 210 గా అధికారులు గుర్తించారు.

**మనమిత్ర వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్:** ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాశాఖ సూచిస్తుంది. దీంతో విద్యార్థులకు సమయం ఆదాకావడంతోపాటు, ఖర్చులు తగ్గుతాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీజీఎస్ సూచించింది.

# తిరుపతిలో బాసర తరహా అక్షరాభ్యాసం

**వకుళమాత ఒడిలో "అక్షర గోవిందం"**

**తొలి అక్షరానికి శ్రీకారం చుట్టించడం హిందూ కుటుంబాల్లో ఆనవాయితీ**

**తిరుపతిలోని శ్రీవకుళమాత ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసేందుకు అవకాశం**

**చిన్నారులకు 7 వస్తువులతో కిట్**



తిరుమల తిరుపతి దేవస్థానం మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అక్షర గోవిందం పేరిట అక్షరాభ్యాస వేడుకలను ప్రారంభించనుంది. తెలంగాణలోని బాసర జ్ఞానసరస్వతీదేవి ఆలయం తరహాలో తిరుపతిలో శ్రీవకుళమాత ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసేందుకు అవకాశం కల్పించనుంది. కార్యక్రమంలో భాగంగా టీటీడీ ఓ కిట్ కూడా ఇవ్వనుంది. మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.బుడి బుడి అడుగులతో బడి గడప తొక్కే వయసులో, ఆ చిన్నారి చేతులకు పలకా బలపం ఇచ్చి దైవ సన్నిధిలో తొలి అక్షరానికి శ్రీకారం చుట్టించడం అనేది హిందూ కుటుంబాల్లో ఆనవాయితీ. ఆ అక్షరాభ్యాస వేడుక ఏడుకొండలవాడి ఆశీస్సులతో, స్వామి వారి మాతృమూర్తి అయిన శ్రీవకుళమాత సన్నిధిలో జరిగితే ఆ ఆనందమే వేరు! తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇప్పుడీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది.

**పైలట్ ప్రాజెక్టుగా అమలు :** తెలంగాణలోని ప్రసిద్ధ క్షేత్రాలలో ఒకటైన బాసర జ్ఞానసరస్వతీదేవి ఆలయం తరహాలో తిరుపతిలోని వకుళమాత ఆలయంలోను కూడా "అక్షరాభ్యాసం" పూజా విధానాన్ని ప్రవేశ పెట్టాలని టీటీడీ నిర్ణయించింది. ప్రారంభ దశలో కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది.3 నుంచి 5 ఏళ్లు వయసు ఉన్న చిన్నారులకు భగవంతుని ఆశీస్సులతో విద్యాబుద్ధులు ప్రసాదించాలనే సదుద్దేశంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ (ఎఙ్రా) "అక్షర గోవిందం" ప్రాజెక్టును రూపొందించింది.

**బోర్డు సమావేశంలో సానుకూలంగా నిర్ణయం :** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజ్ఞప్తి మేరకు టీటీడీ అధికారులు ఇటీవల తిరుపతి శివారు పేరూరులోని వకుళమాత దేవాలయాన్ని సందర్శించారు. ప్రాజెక్టు అమలకు సంబంధించి బోర్డు సమావేశంలో సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు.వకుళమాత ప్రధాన ఆలయం చిన్న కొండ పై నెలకొని ఉండడం వల్ల అక్కడ స్థలాభావం ఉంది. దీంతో అక్షరాభ్యాసానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. ఆలయానికి తూర్పు వైపున ఉన్న ఖాళీ స్థలంలో ఈ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణికి సమీపంలోని ఈ ప్రదేశం ప్రశాంతత, ఆధ్యాత్మికతకు నెలవుగా విలసిల్లుతోంది.

**"అక్షర గోవిందం" పేరిట కిట్ :** ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన సకల వసతులతో మండపాన్ని నిర్మించనున్నారు. ఈ వేదిక పై వేంకటేశ్వర స్వామి, పద్మావతి, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాలు దిద్దించనున్నారు. అక్షరాభ్యాసం తర్వాత పిల్లలకు "అక్షర గోవిందం" పేరిట రూపొందించిన కిట్‌ను అందజేస్తారు.

**చిన్నారులకు 7 వస్తువులతో కిట్**

ఈ కిట్‌లో మొత్తం ఏడు వస్తువులు ఉంటాయి. అవి పలక, బలపాల బాక్స్, శ్రీవారి అక్షతలు, అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, 6 కంకణాలు, పటిక బెల్లం (కలకండ) ప్రసాదం ప్యాకెట్, వినాయకుడు -సరస్వతీదేవి-శ్రీ వేంకటేశ్వర స్వామితో కూడిన చిత్రపటం (ఫ్రేమ్) ఉంటాయి. పైలట్ ప్రాజెక్టుగా తొలుత 300 కిట్లతో ప్రారంభించనున్నారు. కిట్లను ఉచితంగా పంపిణీ చేయాలా లేక నామమాత్రపు రుసుము వసూలు చేయాలా అనే విషయంపై త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఈ ప్రాజెక్టును ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ లేదా హెచ్‌డీపీపీ ద్వారా అమలు చేయనున్నారు.

# వంట చెరుకుకు భారీగా పెరిగిన డిమాండ్

**తెల్లవారుజాము నుంచే కట్టెల మండీ వద్ద క్యూ**

**కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్ల నిర్వాహకులకు తప్పని తిప్పలు**

**వంట చెరుకుకు క్రమంగా పెరుగుతున్న డిమాండ్**

**పెళ్లిళ్ల సీజన్ కావడంతో టన్నుల కొద్దీ వంటచెరుకు కొనుగోలు చేస్తున్న హోటళ్ల నిర్వాహకులు**



పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరతతో హైదరాబాద్ నగరంలో కట్టెలకు ఫుల్ డిమాండ్ పెరిగింది. మూడు రోజుల కిందట క్వింటాల్ రూ.1200 ఉన్న వంట చెరుకు, ఇప్పుడు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో పలు ఫంక్షన్ హాళ్లు, హాస్టల్, రెస్టారెంట్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. సిలిండర్ల సరఫరా తగ్గడంతో ముఖ్యంగా హోటళ్ల వ్యాపారంపై ప్రభావం పడుతోంది.

**వంట చెరుకుకు పెరుగుతున్న డిమాండ్ :** ప్రస్తుత పరిస్థితుల్లో వంట చెరుకుకు డిమాండ్ అధికంగా ఉండటంతో భువనగిరి, ఆలేరు నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్నాయి. వాణిజ్య గ్యాస్ కొరతతో రాజధాని నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. రిస్క్ చేసి నడుపుతున్న వారు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో కట్టెల పొయ్యి పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆయా హోటళ్ల నిర్వాహకులు కట్టెల మండీల వద్ద క్యూ కడుతున్నారు. ఇంట్లో చేసే చిన్నపాటి ఫంక్షన్లకూ గ్యాస్ కోసం ప్రయత్నిస్తే దొరికే పరిస్థితి లేదని, 30 రోజుల ముందు (ఒక నెల) బుక్ చేయాలని అంటున్నారంటూ వినియోగదారులు వాపోతున్నారు.

శాంతినగర్‌లో తెలంగాణ ఫిష్ క్యాంటిన్ కోసం తెచ్చిన కట్టెలు

దొరకని గ్యాస్ బండ : రెండు రోజులుగా రెట్టింపు ధర పలికిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ గురువారం కొనుగోలు చేయాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదని పలువురు వసతిగృహాల యజమానులు వాపోయారు. నో స్టాక్ అంటూ చెప్పారని తెలిపారు. దీంతో ఇక కట్టెల పొయ్యిలే దిక్కయ్యాయని చెబుతున్నారు.

**సిలిండర్ల గురించి ఆలోచించడం లేదు :** ప్రస్తుత వాణిజ్య సిలిండర్ల ధరలకు వసతిగృహం నడపలేమని హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉంటున్న వారిని ఇబ్బంది పెట్టలేమని, రోజుకు రూ.150 అద్దెకు కట్టెల పొయ్యి తెచ్చుకుని కట్టెలు సైతం డంప్ చేసుకున్నట్లుగా ఆయన తెలిపారు."ఆదివారం ఓ మూడు వేల మందికి క్యాటరింగ్ అందించాల్సి ఉంది. ఇంత మందికి కట్టెల పొయ్యిపైనే వంట చేయనున్నాం. ఇప్పటికే కట్టెల లోడ్ సిద్ధం చేసుకున్నాం"- ఉపేందర్, క్యాటరింగ్ నిర్వాహకుడు, కేపీహెచ్‌బీ కాలనీ."సుమారు 400 మంది విద్యార్థులున్న హాస్టల్‌లో అన్నం, సాంబార్, పప్పు, కూరతో పాటు రెండు రోజులకు రెండు ఎల్పీజీ వాణిజ్య సిలిండర్ల (19 కేజీలు)కు రూ.3,400 ఖర్చయ్యేది. అదే ఇప్పుడు టన్ను(1000 కేజీలు) కట్టెలకు రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత ఖర్చు చేసి పెద్ద మొత్తంలో వంట చెరుకు కొందామంటే దొరకని పరిస్థితి. కొనేందుకు వేచి ఉండక తప్పడం లేదు. ఇదో రకమైన సమస్య అయితే, వంటవాళ్లతో మరో పేచీ వచ్చి పడింది. వేసవి కాలం కావడంతో కట్టెల పొయ్యిపై వండలేమని, పొగ, సెగ వల్ల ఇబ్బంది పడుతున్నామని, మరింత ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తున్నారు - రాజారావు, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, అమీర్‌పేట్

**గ్యాస్ సిలిండర్ల సరఫరాను వెంటనే ప్రారంభించాలి :** హైదరాబాద్ నగరంలో ఐటీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వసతి పొందుతున్న ప్రైవేటు పీజీ హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ కోరింది. రాయదుర్గంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, కోశాధికారి మహీదర్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లోని 11 వేల హాస్టళ్లలో వసతి పొందుతున్న 10 లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక్కో వసతి గృహం (హాస్టల్‌లో) దాదాపు 100 నుంచి 300 మంది వరకు ఉన్నారని, ఒక గ్యాస్ సిలిండర్ రెండు రోజులు వస్తుందని పేర్కొన్నారు.

# గ్యాస్ బుకింగ్‌లో తీవ్ర అవస్థలు

**సిలిండర్ డెలివరీకి వారంపైగా గడువు! , ఆన్‌లైన్ బుకింగ్‌లో అవస్థలు**

**గ్యాస్ ఏజెన్సీల వద్దకు జనం పరుగులు , వాణిజ్య సిలిండర్ల కొరతతో కట్టెలకు డిమాండ్**

**ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ రావాల్సింది , ఇప్పుడు వారం రోజుల సమయం**



పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇంటి అవసరాల కోసం గ్యాస్ వినియోగదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తవని సర్కార్ ప్రకటిస్తూనే ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. పలు ప్రాంతాల్లో సిలిండర్ బుకింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ మార్గాలు కొన్ని పని చేయడం లేదు. దీంతో వినియోగదారులు నేరుగా ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడం, బుకింగ్ సిస్టమ్ నెమ్మదించడం వల్ల సమస్య ఏర్పడిందని ఏజెన్సీల నిర్వాహకులు తెలుపుతున్నారు.

**పరిస్థితి చేయి దాటితే బ్లాక్‌లో తీసుకునే ప్రయత్నం :** డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ సాధారణ రోజుల్లో బుక్ చేస్తే ఒకటి, రెండు రోజుల్లో సిలిండర్ వస్తుంది. కానీ ఇప్పుడు వారంపైగా పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో భారత్, ఇండేన్, హెచ్‌పీ మూడు ఏజెన్సీలు గ్యాస్ సరఫరా చేస్తున్నాయి. 350 నుంచి 400 మంది డీలర్లు ఉండగా, అందులో 30 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. సింగిల్ సిలిండర్ మాత్రమే ఉండి, అది అయిపోయిన వారంతా బుక్ చేసుకునేందుకు ఏజెన్సీల వద్ద లైన్లు కడుతున్నారు. నేరుగా ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వాణిజ్య కేటగిరి సరఫరా ఆగిపోవడంతో డొమెస్టిక్ సిలిండర్లను టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు బ్లాక్‌లో తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఎల్‌పీజీ కొరత లేదు :** రంగారెడ్డి జిల్లాలో ఎల్‌పీజీకి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ఎల్‌పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సిలిండర్ పంపిణీకి ఎటువంటి అంతరాయాలు లేకుండా యథావిధిగా కొనసాగడానికి తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. వినియోగదారులు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు నిల్వ చేసుకోవద్దని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి వనజాతరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రత్యామ్నాయాలున్నాయ్ :**

గ్యాస్ స్టవ్‌కు ప్రత్యామ్నాయంగా వంటకు మోడ్రన్ ఇండక్షన్ స్టవ్, ఎలక్ట్రిక్ కుక్కర్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో చేస్తే తక్కువ ఖర్చుతో, ఎలాంటి హాని కలగకుండా వంట చేసుకోవచ్చు.అంతేకాదు సోలార్, బయోగ్యాస్, బొగ్గు కట్టెల పొయ్యి వినియోగించవచ్చు.పశువుల వ్యర్థాల నుంచి గోబి గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. దీనిని గృహాలు, వ్యవసాయ, పరిశ్రమల అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.ఇండక్షన్ స్టవ్ విద్యుత్తుతో పని చేస్తుంది. వంటను స్పీడ్‌గా రెడీ చేసుకోవచ్చు. అలా చేస్తే గ్యాస్ కంటే తక్కువ ఖర్చవుతుంది.ఎలక్ట్రిక్ కుక్కర్, హాట్ ప్లేట్‌తో అన్నం, కూరలు వంటివి ఈజీగా కుక్ చేసుకోవచ్చు.

ఇన్‌ఫ్రారెడ్ స్టవ్ విద్యుత్తుతో పని చేస్తుంది.

**బయట గ్యాస్ సిలిండర్లు లేవు - ఇలా ఆదా చేయండి :**

గ్యాస్ వెలిగించిన తర్వాత గిన్నెలు, కావాల్సిన పదార్థాల కోసం వెతకడంతో మంట మండుతుండటం వల్ల గ్యాస్ వృథా అవుతుంది.ఉడికించే పదార్థాలకు ప్రెషర్ కుక్కర్లను ఉపయోగిస్తే దాదాపు గ్యాస్ పొదుపు చేయొచ్చు.పెద్ద పాత్రలు, మూతలేని పాత్రలు ఉపయోగిస్తే చేసే దానికంటే ఎక్కువ వేడి చేయాలి. అంటే గంటకు 7.2 ?శాతం గ్యాస్‌ని కోల్పోతాం. దానిపై మూతలు పెట్టడంతో 1.45 శాతం ఆదా అవుతుంది.తక్కువ ఆహార పదార్థాలు వండటానికి చిన్న బర్నల్ వినియోగిస్తే 10 శాతం గ్యాస్ తక్కువ వినియోగమవుతుంది.తక్కువ లోతు ఉన్న వంట పాత్రలు వాడితే తొందరగా వేడి బయటకు వెళ్లి గ్యాస్ వృథా అవుతుంది. లోతుగా ఉన్నవాటిని వాడితే అది వేడి అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాని వల్ల అధిక గ్యాస్ వినియోగం అవుతుంది. ఇకపై వంట చేసే ముందు బియ్యం, పప్పులు లాంటివి అరగంట ముందే నానబెడితే గ్యాస్ ఆదా అవుతుంది.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త "పాన్‌కార్డ్ రూల్స్"

## ఇవి తెలుసుకోకపోతే బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ ఆగిపోవచ్చు!

## కొత్త ఆదాయపు పన్ను చట్టానికి అనుగుణంగా పాన్‌లో మార్పులు

## నగదు డిపాజిట్ నుంచి ఇన్సూరెన్స్ పాలసీల వరకు!



ఇండియాలో ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్‌కు "పాన్ కార్డు" అనేది చాలా కీలకంగా ఉంటుంది. బ్యాంక్ అకౌంట్ దగ్గర నుంచి ఐటీ రిటర్నుల ఫైలింగ్ వరకు అన్నింటికీ ఇది ఉండాల్సిందే. ఆర్థిక లావాదేవీల విషయంలో భారతీయులకు ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఒకటైన పాన్‌కార్డుకు సంబంధించి ఏప్రిల్ 1, 2026 నుంచి కొన్ని కొత్త రూల్స్ రాబోతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న రూల్స్ ప్రకారం, చిన్న మొత్తాలకే పాన్ అవసరం పడుతుంది. అయితే, రాబోతున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025కు అనుగుణంగా రూపొందించిన డ్రాఫ్ట్ రూల్స్‌లో పాన్‌కు సంబంధించి కొన్ని కీలక మార్పులు తీసుకొస్తున్నారు. మరి, ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డు వినియోగంలో రాబోతున్న ఆ కీలకమైన మార్పులేంటో ఇప్పుడు చూద్దాం. 1961 పాత ఆదాయపు పన్ను చట్టం ప్లేస్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 తీసుకొస్తున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా రూపొందించిన "ఆదాయ పన్ను ముసాయిదా నిబంధనలు-2026" ద్వారా పాన్ కార్డు నిబంధనలలో కీలక మార్పులు రానున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఆదాయ పన్ను చెల్లింపుదారులకు, అధిక విలువ కలిగిన లావాదేవీలు నిర్వహించే వారికి ఊరటనిచ్చేలా ఉండనున్నాయి. నగదు డిపాజిట్లు, వాహన కొనుగోళ్లు, స్థిరాస్తి లావాదేవీల విషయంలో సామాన్యులకు మేలు చేయనున్నాయి. కేంద్రం తీసుకొస్తున్న ఈ కొత్త పాన్ కార్డు రూల్స్ 2026, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్ ఉంది.

**నగదు డిపాజిట్, విత్‌డ్రా :**

ప్రస్తుతం ఒక రోజులో బ్యాంకులో 50 వేల రూపాయల కంటే ఎక్కువ మనీ డిపాజిట్ చేసినప్పుడు పాన్ తప్పనిసరి అనే నిబంధన అమలులో ఉంది. అయితే, ఏప్రిల్ 1 నుంచి ఈ విధానంలో మార్పు రానుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు అకౌంట్స్‌లో కలిపి మొత్తం రూ.10లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసిన సందర్భాల్లో పాన్‌కార్డు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. అంటే, ప్రస్తుతం ఉన్న రోజువారీ పరిమితి స్థానంలో వార్షిక పరిమితి అనే కొత్త నిబంధనను తీసుకొస్తున్నారు.

**హోటల్, ఈవెంట్ ఖర్చులు :**

ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం హోటల్ లేదా రెస్టరెంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్‌కార్డు ఇవ్వాలి. కొత్త నిబంధనల ప్రకారం, ఈ పరిమితిని రూ.1లక్షకు పెంచనున్నారు. ఈ కొత్త నిబంధన అమలులోకి వస్తే హోటళ్లు, రెస్టరెంట్లు, బ్యాంక్వెట్ హాళ్లు లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు రూ.1లక్షకు మించి ఏదైనా చెల్లింపులు చేసినప్పుడు మాత్రమే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.

**మోటార్ వాహనాల కొనుగోలు :**

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం టూ వీలర్స్ కాకుండా మిగతా ఏ వెహికల్ కొనుగోలు చేసినా పాన్ కార్డు ఇవ్వాలి. అయితే, కొత్త రూల్ ప్రకారం ద్విచక్ర వాహనాలతో సహా ఏ వాహనం కొనుగోలు చేసినా దాని ధర రూ.5లక్షలు దాటితేనే పాన్ తప్పనిసరి చేస్తున్నారు. అలాకాకుండా బైకులు, కార్లు కొనుగోలు చేసినప్పుడు వాటి ధర రూ.5లక్షల కంటే తక్కువ ఉంటే అప్పుడు పాన్‌కార్డు ఇవ్వాల్సిన పని లేదు.

**స్థిరాస్తి లావాదేవీలు :**

ప్రస్తుతం ఉన్న రూల్స్ ప్రకారం రూ.10లక్షలు దాటిన స్థిరాస్తి లావాదేవీలకు పాన్ తప్పనిసరి. అయితే, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధన ప్రకారం ఈ పరిమితిని రూ.20 లక్షలు చేయనున్నారు. దాని ప్రకారం స్థలం, ఇల్లు కొనుగోలు, అమ్మకం లేదా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాల విలువ రూ.20లక్షలు దాటితేనే పాన్‌కార్డు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

**ఇన్సూరెన్స్ పాలసీలు :**

పైన చెప్పిన అంశాల్లో వెసులుబాటు కల్పించిన కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో మాత్రం పాన్ కార్డ్ రూల్స్‌ను కఠినతరం చేసింది. ప్రస్తుతం ఏదైనా ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నప్పుడు ప్రీమియం అనేది రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటేనే పాన్ వివరాలు ఇవ్వాలి. కానీ, కొత్త నిబంధనల ప్రకారం బీమా సంస్థల నుంచి ఏ తరహా పాలసీ తీసుకోవాలన్నా పాన్ తప్పనిసరి అనే నిబంధనను తీసుకొస్తున్నారు. అంటే, ఎవరైనా కొత్తగా పాలసీ తీసుకునేటప్పుడు ప్రీమియం మొత్తంతో సంబంధం లేకుండా పాన్‌కార్డు ఇవ్వాల్సిందే. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టం-2025కు అనుగుణంగా పాన్ కార్డుకు సంబంధించిన పైన పేర్కొన్న మార్పులను ప్రతిపాదిస్తున్నారు.

# మీ క్రెడిట్ స్కోర్ సరిగ్గా లేదా - అయినా, ఈ పద్ధతుల్లో "లోన్స్" పొందవచ్చు!

## లోన్ మంజూరు కావాలంటే మెరుగైన క్రెడిట్ స్కోర్ కంపల్సరీ

## కానీ స్కోర్‌తో సంబంధం లేకుండా కూడా లోన్స్ పొందవచ్చు!




ఆర్థిక అవసరాలు ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదు. పెద్ద మొత్తంలో డబ్బులు అవరసం పడినప్పుడు చాలా మంది రుణాల వైపు చూపుస్తారు. అయితే లోన్ తీసుకోవాలని బ్యాంక్‌లు లేదా ఫైనాన్స్ కంపెనీలకు వెళ్లినప్పుడు అక్కడి అధికారులు అడిగే ఫస్ట్ క్వశ్చన్ "మీ క్రెడిట్ స్కోర్ ఎంత?". ఎందుకంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్ ఉంటే లోన్ వచ్చే అవకాశం తొందరగా ఉంటుంది. అంతేకాకుండా వడ్డీ కూడా తక్కువే ఉంటుంది. అయితే చాలా మంది సిబిల్ స్కోర్ లేకపోతే బ్యాంకులు లోన్లు ఇవ్వవని ఫీల్ అవుతుంటారు. కానీ మీకు క్రెడిట్ స్కోర్ లేకపోయినా, తక్కువ ఉన్నా కొన్ని పద్ధతులు ఫాలో అయితే ఈజీగా లోన్ పొందవచ్చని నిపుణులు అంటున్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఈ స్టోరీలో చూద్దాం. గోల్డ్ లోన్స్: క్రెడిట్ స్కోర్‌తో పని లేకుండా ఈజీగా పొందగలిగే రుణాల్లో గోల్డ్ లోన్స్ ముందుంటాయి. బ్యాంకులు కూడా ఇటువంటి రుణాలు ఇవ్వడానికి ముందుకొస్తుంటాయి. క్రెడిట్ స్కోరుతో పనిలేకుండా తక్కువ వడ్డీతో అధిక మొత్తంలో రుణం పొందడానికి ఇది మంచి అవకాశం. ఇంకా, కేవలం ఒకటి లేదా రెండు రోజుల్లోనే లోన్ అప్రూవ్ అయ్యి డబ్బులు అకౌంట్లో జమ అవుతాయి.

**స్థిరాస్తి లోన్స్:**

రుణాలు కావాలనుకునేవారికి ఇంకో బెస్ట్ ఆప్షన్ స్థిరాస్తి లోన్. ఏదైనా రెసిడెన్షియల్ లేదా కమర్షియల్ ప్రాపర్టీ ఉంటే సిబిల్ స్కోర్ అవసరం లేకుండానే ఈజీగా లోన్ పొందొచ్చు. బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ కంపెనీలు స్థిరాస్తులను హామీగా పెట్టుకుని తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందిస్తున్నాయి. ఇలా ఆస్తి తనాఖా పెట్టి పొందే రుణాలు స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు మంచి ఎంపిక. ఇలాంటి రుణాలపై వడ్డీ రేటు తక్కువ, రుణాన్ని తిరిగి చెల్లించడానికి టైమ్‌ని ఎంచుకునే అవకాశం ఉంటుంది.

**హామీదారుడి సాయంతో:** మెరుగైన క్రెడిట్ స్కోరు లేకపోయినా సరే, మీ కుటుంబ సభ్యుడిని లోన్‌కు హామీదారుగా ఉండమని మీరు కోరవచ్చు. అయితే, ఆ వ్యక్తికి మాత్రం మెరుగైన క్రెడిట్ స్కోరు ఉండాలి. అంతేకాకుండా అతని క్రెడిట్ స్కోర్ గురించి ఫైనాన్స్ కంపెనీలకు నిరూపించాల్సి ఉంటుంది. జ×దీ×ూ నేపథ్యం లేని వారు కూడా ఎడ్యుకేషన్ లేదా పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇది అత్యంత సాధారణ విధానం.

**జీవిత బీమా పాలసీపై:**

సరెండర్ విలువ కలిగిన లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను ఉపయోగించి క్రెడిట్ స్కోర్ లేకున్నా వ్యక్తిగత రుణాలను పొందవచ్చు. పాలసీ డాక్యుమెంట్‌పై రుణం పొందడానికి సిబిల్ స్కోర్ అవసరం లేదు. అయితే, ఈ రుణం పొందాలంటే పాలసీ తీసుకున్న వ్యక్తి కనీసం 3 సంవత్సరాలు ప్రీమియం చెల్లించాలి. దీని వల్ల లోన్ పొందడానికి ఈజీ అవుతుంది.

**అద్దె డిపాజిట్ కోసం:** అద్దెకు ఉండేవారు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారుతున్నప్పుడు ఎక్కువ మొత్తం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. కొంతమందికి ఇది కూడా భారంగానే ఉంటుంది. ఇలాంటి ఖర్చులు చెల్లించడానికి మీవద్ద తగినంత నగదు లేకపోతే లోన్స్ కోసం ట్రై చేయవచ్చు. కొన్ని ఫైనాన్స్ సంస్థలు "రెంట్ డిపాజిట్" రుణాలను అందిస్తాయి. ఇవి అన్‌సెక్యూర్డ్ రుణాలు. రుణ సంస్థలు ఇంటి ఓనర్‌కు నేరుగా చెల్లిస్తాయి. అయితే, ఈ రుణ సౌకర్యాన్ని ప్రత్యేకంగా ఇలాంటి అవసరాలకే రూపొందించారని గుర్తుంచుకోవాలి.

**పొదుపు ఖాతాపై ఓవర్‌డ్రాఫ్ట్:**

అనేక బ్యాంకులు లేదా రుణ సంస్థలు సేవింగ్స్ అకౌంట్స్‌పై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. అంటే పరోక్షంగా లోన్ ఇవ్వడమే. అకౌంట్ ఉన్నవారు ఓ టైమ్ వరకు వారి అకౌంట్‌లోని బ్యాలెన్స్ కంటే ఎక్కువ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి ఇందులో ఆప్షన్ ఉంటుంది. ఈ ప్రీ-అప్రూవ్డ్ క్రెడిట్ లైన్‌కు సిబిల్ స్కోర్ అవసరం లేదు. అయితే, ఇది బ్యాంకుకు అకౌంట్ హోల్డర్‌కు ఉన్న సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.

# హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారా...

## ఈ విషయాలు తెలుసుకుంటే మంచిది!

## పెరిగిన వైద్య ఖర్చుల నిమిత్తం కీలకంగా ఆరోగ్య బీమా

## బీమా తీసుకునేటప్పుడు ఈ విషయాలు గుర్తుంచుకోవాలంటున్న



నేటి రోజుల్లో వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. జ్వరం నుంచి పెద్ద సర్జరీల వరకు లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ అనేది చాలా ముఖ్యం. కానీ ఇప్పటికీ చాలా మంది దీనిని అవసరం లేని ఖర్చుగా భావిస్తున్నారు. మాకు ఏమవుతుందిలే అని నిర్లక్ష్యం వహిస్తున్నారు. కానీ వాస్తవానికి, ఆరోగ్య బీమా అనేది ఒక రక్షణ కవచం అని నిపుణులు అంటున్నారు. అనుకోని ఆరోగ్య సమస్యల సమయంలో మనకు రక్షణగా నిలబడి ఆర్థిక భద్రతను కలిగిస్తుందని అంటున్నారు. అయితే ఏ ప్లాన్ పడితే అది కొనుగోలు చేయకూడదని.. మన అవసరాలకు తగినట్లుగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశీయ దిగ్గజ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు విషయంలో కొన్ని టిప్స్ సూచిస్తోంది. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.

**హెల్త్ పాలసీ ఎందుకు అవసరం :** సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం నుంచి గుండె సమస్యలు, శస్త్ర చికిత్సలు వరకు అన్నింటికీ వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి సమయంలో హెల్త్ పాలసీ ఉంటే ఆసుపత్రి ఖర్చులు తగ్గుతాయని, జేబు ఖాళీ కాకుండా, అప్పుల పాలవకుండా ఉంటామని అంటున్నారు. క్యాష్‌లెస్ హాస్పిటలైజేషన్, ఫ్యామిలీ కవర్, ట్యాక్స్ మినహాయింపు వంటి ప్రయోజనాలు కూడా ఉండటంతో హెల్త్ పాలసీ తీసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**సరైన కవరేజ్ ఎంచుకోవడం:** హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో మొదటిగా పరిగణనలోకి తీసుకోవాల్సినది కవరేజ్. ఆసుపత్రి ఖర్చులు (డాక్టర్ ఫీజు, రూమ్ రెంట్), హాస్పిటల్‌లో చేరే ముందు, డిశ్చార్జ్ తర్వాత, అవుట్ పేషెంట్ సర్వీసెస్, క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి పెద్ద జబ్బులకు అయ్యే ఖర్చులు కూడా కవర్ అయ్యేలా ప్లాన్ ఎంచుకోవాలి.

**ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్స్:** విడివిడిగా ఒక్కొక్కరు పాలసీలు తీసుకునే బదులు ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవడం మంచిదంటున్నారు. అంటే ఒక పాలసీ కింద కుటుంబ సభ్యులందరికీ పాలసీ కవర్ అవుతుంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా పాలసీలు తీసుకోవడం కంటే, అందరికీ కలిపి ఒకే ప్లాన్ తీసుకోవడం వల్ల ప్రీమియం ఖర్చు చాలా తగ్గుతుంది.

**సరైన బీమా మొత్తం:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో బీమా మొత్తం (ూబఎ ×అంబతీవస) అనేది మీరు అనారోగ్యం పాలైనప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీ గరిష్టంగా చెల్లించే డబ్బు. పెద్ద పట్టణాల్లో నివసిస్తోన్న వారు అయితే ఎక్కువ మొత్తంలో, చిన్న పట్టణాల్లో ఉండే వారి అయితే మధ్యస్థంగా కవరేజ్ ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. అదే విధంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొంచెం ఎక్కువ మొత్తాన్ని ఎంచుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

**లైఫ్‌టైమ్ రెన్యువబిలిటీ:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో "లైఫ్ టైమ్ రెన్యూవబిలిటీ" అనేది అత్యంత కీలకమైనదని నిపుణులు చెబుతున్నారు. అంటే ఈ ఆప్షన్ ద్వారా మీరు ఒకసారి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే, మీ వయసుతో సంబంధం లేకుండా జీవితాంతం ఆ పాలసీని కొనసాగించే హక్కు మీకు ఉంటుంది. కాబట్టి పాలసీ కొనుగోలు చేసేముందు ఈ ఆప్షన్ ఎంచుకుంటే మంచిదంటున్నారు.

**క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో మరో ముఖ్యమైన అంశం క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక ఇన్సూరెన్స్ కంపెనీకి వచ్చిన మొత్తం క్లెయిమ్‌లలో, ఆ కంపెనీ ఎన్ని క్లెయిమ్‌లను అప్రూవ్ చేసి డబ్బులు చెల్లించిందో తెలిపే పద్ధతే ఇది. కాబట్టి పాలసీ కొనుగోలు చేసేముందు ఆ కంపెనీ జూ= ఎంత ఉందో చూడటం ముఖ్యముంటున్నారు. ఎక్కువ పర్సంటేజ్ ఉన్న వాటిని ఎంచుకుంటే క్లెయిమ్ ప్రాసెస్ కూడా ఫాస్ట్‌గా ఉంటుంది.

**వెయిటింగ్ పీరియడ్:** కొన్ని బీమా పాలసీల్లో కొన్ని వ్యాధుల కోసం 2-4 సంవత్సరాల వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. అంటే, పాలసీ తీసుకున్న వెంటనే ఆ ప్రయోజనాలు అందవు. కాబట్టి వాయిదా కాలం ఎంత ఉంది? అనే విషయంపై స్పష్టత ఉండాలి. పాలసీ కొనేముందు ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**ఇవి కూడా :**

ఆసుపత్రిలో చికిత్స అనంతరం బీమా క్లెయిమ్ చేయడంలో మీ పాలసీ ఎంత సులభతరంగా పని చేస్తుంది అనేది తెలుసుకోవాలని చెబుతున్నారు. మీ పాలసీ కవర్ తక్కువగా ఉన్నప్పుడు, అదనంగా టాప్-అప్ పాలసీని తీసుకోవచ్చు. ఇది అధిక ఆరోగ్య ఖర్చులను తక్కువ ఖర్చుతో కవరేజ్ ఇస్తుంది. సంవత్సరం వ్యవధిలో క్లెయిమ్ లేకుండా పాలసీ కొనసాగితే, కొన్ని కంపెనీలు నో-క్లెయిమ్ బోనస్ ఇస్తాయి. అంటే ఇన్సూరెన్స్ కవర్ పెరుగుతుంది. కాబట్టి కొత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసేవారు ఈ విషయాలు తెలుసుకుంటే మంచిదంటున్నారు.

# "కూలర్" కొంటున్నారా - ఇవి చూసి తీసుకోకపోతే మీ డబ్బులు వృథా!

## మంచి కూలర్ ఎలా సెలెక్ట్ చేసుకోవాలి

## కొనే ముందు ఇవి చూడాలంటున్న నిపుణులు!

మార్చిలో భానుడి భగభగలు మొదలయ్యాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఇంట్లో ఉక్కపోతతో జనాలు ఇబ్బందిపడుతుంటారు. ఈ క్రమంలోనే ఇళ్లలో చల్లదనం కోసం రకరకాల మార్గాలు అనుసరిస్తుంటారు. అందులో మెజార్టీ పీపుల్ ఎయిర్ కూలర్లు కొనుగోలు చేస్తుంటారు. ఎందుకంటే ఏసీతో పోల్చితే తక్కువ ధరకు లభించడం, మెయింటెనెన్స్ కూడా సులభంగా ఉంటుంది కాబట్టి. అయితే, కూలర్ కొనుగోలు చేసేటప్పుడు చాలా మంది తక్కువ ధరకు వస్తుందని, ఫీచర్లు చూడకుండా ఏది పడితే అది కొనేస్తుంటారు. తర్వాత ఇబ్బంది పడుతుంటారు. మరి, ఈ సమ్మర్‌లో మీరూ కొత్త కూలర్ కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నారా? ఎలాంటి ఫీచర్స్ ఉన్న కూలర్ తీసుకుంటే మంచిది? సరైనది ఎలా సెలెక్ట్ చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఎయిర్ కూలర్ కొనే ముందు కొన్ని ఫీచర్లు తప్పక పరిశీలించాలంటున్నారు నిపుణులు. అప్పుడే మీ డబ్బులు వేస్ట్ అవ్వకుండా ఒక మంచి కూలర్ తీసుకోగలుగుతారని సూచిస్తున్నారు. మీరు కూలర్ కొనేటప్పుడు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయాల్లో ఒకటి కూలర్ రకం. ఎందుకంటే మార్కెట్లో అనేక రకాల కూలర్లు ఉంటాయి. వాటిల్లో మీ ఫ్యామిలీ అవసరాలకు సరిపోయినదని ఎంచుకోవడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు.

**కూలర్ టైప్ :** మీ ఇంట్లో చిన్న చిన్న గదులు ఉండి, ఒక ప్లేస్ నుంచి మరో ప్రాంతానికి ఈజీగా తీసుకెళ్లేందుకు అనువుగా ఉండాలంటే పర్సనల్ లేదా టవర్ కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు. అయితే, ఇవి ఒకరిద్దరికి మాత్రమే సరిపోతాయని గుర్తుంచుకోవాలి. అలాకాకుండా గదిలో స్థిరంగా ఒకచోట పెట్టాలనుకుంటే మాత్రం విండో కూలర్లు మంచి ఆప్షన్. బాడీ భాగం బయట ఉండి కేవలం ఫ్యాన్ భాగం మాత్రమే లోపల ఉండి విశాలంగా గాలిని అందిస్తుంది. అదే, పెద్ద పెద్ద గదులు ఉండి, ఇంట్లో ఐదారుగురు ఉన్నట్లయితే మాత్రం డిజర్ట్ కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు.

**కెపాసిటీ :** ఎయిర్ కూలర్ కొనుగోలు చేసేటప్పుడు తప్పక చూడాల్సిన మరో ముఖ్యమైన ఫీచర్ 'వాటర్ కెపాసిటీ'. వీలైనంత వరకు ఎక్కువ వాటర్ కెపాసిటీ ఉన్న వాటిని తీసుకోవడం మంచిది. ఎందుకంటే ప్రతిసారీ నీటిని నింపే ఇబ్బంది ఉండదు. అయితే, చిన్న రూమ్స్ ఉండి చిన్నపాటి కూలర్ కావాలనుకునే వాళ్లకు 20 నుంచి 30 లీటర్ల కెపాసిటీ ఉన్న కూలర్ సరిపోతుందంటున్నారు నిపుణులు. అదే, పెద్ద రూమ్స్ ఉంటే 30 నుంచి 40 లీటర్ల కెపాసిటీ ఉండేవి ఎంచుకోవడం మంచిదంటున్నారు.

**"పాత కూలర్" ఇలా క్లీన్ చేయండి! – కొత్తదానిలా మంచి స్పీడ్, స్వచ్ఛమైన గాలి!**

**కూలర్ ప్యాడ్ ఎంపిక :** మంచి కూలర్ ఎంపికలో కూలింగ్ ప్యాడ్లు కూడా కీలకం. మార్కెట్లో యాస్పెన్ ప్యాడ్, హనీ ప్యాడ్ అనే రెండు రకాల కూలింగ్ ప్యాడ్‌లతో కూలర్లు ఎక్కువగా అందుబాటులో ఉంటుంటాయి. యాస్పెన్ ప్యాడ్ అంటే గడ్డి తరహాలో ఉండే కూలింగ్ ప్యాడ్లు. తక్కువ ధరకు లభించే వాటిల్లో ఈ తరహావే ఉంటాయి. వీటి మన్నిక కూడా తక్కువని గుర్తించుకోవాలి. హనీ ప్యాడ్ అంటే తేనె తుట్టెను పోలిన కూలింగ్ ప్యాడ్లు. వీటి ధర కాస్త ఎక్కువైనప్పటికీ ఎక్కువ మన్నికనిస్తాయి. గదిని కూల్‌గా ఉంచడంలోనూ ఇవి మెరుగ్గా పని చేస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి, కాస్త అధిక ధర పెట్టగలిగే వారు ఈ రకం కూలింగ్ ప్యాడ్లు కలిగిన కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు.


**ఈ ఫీచర్లూ ఉంటే ఇంకా బెటర్!**

కూలర్ తీసుకునేటప్పుడు చప్పుడు తక్కువగా ఉండేలా చూసుకోవడం మంచిది. ఎందుకంటే చప్పుడు ఎక్కువగా ఉంటే రాత్రి వేళల్లో నిద్రకు డిస్టర్బ్ కలిగించవచ్చు. అందుకే, కొనే ముందే ఒకసారి చెక్ చేసుకోవాలి. సాధారణ కూలర్లలో డస్ట్ ఫిల్టర్ వంటి ఆప్షన్లు ఉండకపోవచ్చు. అదే, మీరు కాస్త ఎక్కువ ధర కొంటున్నట్లయితే తప్పసరిగా డస్ట్ ఫిల్టర్ ఉండేలా చూసుకోవడం మంచిదం టున్నారు. ముఖ్యంగా మీ అవసరాలను బట్టి ఒక ప్లేస్ నుంచి మరో ప్లేస్‌కు తీసుకెళ్లడానికి వీలుగా వీల్స్ ఉండే కూలర్లు ఎంచుకోవాలి. లేదంటే సెపరేట్‌గా మళ్లీ స్టాండ్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత మార్కెట్లో రకరకాల ఫీచర్లు కలిగిన కూలర్లు అందుబాటులోకి వస్తున్నాయి. సో కూలర్ కొనేటప్పుడు మీ ధరను బట్టి రిమోట్ కంట్రోల్ ఆప్షన్ ఉండేది తీసుకుంటే ఇంకా మంచిది. ఎందుకంటే రాత్రి వేళ్లలో స్వింగ్, కూల్, స్లీప్ టైమర్ వంటి ఆప్షన్లు ఎంచుకోవడం ఇది చాలా బాగా సహాయ పడుతుందంటున్నారు. కొన్నిసార్లు చాలా రోజులు కూలర్‌ను వాడకుండా అందులో నీటిని అలానే వదిలేస్తుంటాం. ఆ టైమ్‌లో అందులో ఉండే వాటర్ దోమలకు ఆవాసమవుతుంది. కాబట్టి, కూలర్ కొనుగోలు చేసేటప్పుడు దోమలు చొరబడకుండా అడ్డుకునే వ్యవస్థ ఉందేమో చూసుకోవడం ఇంకా మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

# స్టాక్ మార్కెట్లపై వార్ ఎఫెక్ట్- భారీ నష్టాల్లో సూచీలు

## భారీ నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

## సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా డౌన్



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం దేశీయ సూచీలపై ఇంకా కొనసాగుతోంది. చమురు ధరల పెరుగుదలతో కారణంగా గురువారం మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఎర్లీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 990 పాయింట్లకిపైగా, నిఫ్టీ 300 పాయింట్లకి పైగా కోల్పోయాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 897 పాయింట్లు కోల్పోయి 75,965 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 266 పాయింట్ల నష్టంతో 23,600 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ భారీ పతనంఎర్లీ ట్రేడింగ్‌లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 992 పాయింట్లు నష్టపోయి 82,75,871 వద్ద ట్రేడ్ అయ్యింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 310 పాయింట్లు క్షీణించి 23,556 వద్ద ట్రేడ్ అయ్యింది. సెన్సెక్స్ సూచీలో టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అదే సమయంలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆదానీ పోర్ట్స్, టైటాన్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

**జీవనకాల కనిష్ఠానికి రూపాయి విలువ**

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 31 పైసలు కోల్పోయి 92.32 వద్ద కొనసాగుతోంది.

**ఆసియా మార్కెట్లలోనూ నష్టాలు**

మరోవైపు ఆసియా స్టాక్ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ, జపాన్‌కు చెందిన నిక్కీ, షాంఘైకు చెందిన ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ ఇండెక్స్ సుచీలు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇక అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నాస్‌డాక్ మినహా మిగతా అన్ని సూచీలు పడిపోయాయి.

**ముడి చమురు ధరలు భారీగా పెరుగుదల**

ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలకు ప్రమాణంగా భావించే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 8.98 శాతం పెరిగి బ్యారెల్‌కు 100.24 డాలర్లకు చేరింది. అయితే ప్రపంచ ఇంధన సంస్థ(ఐఈఏ) 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు విడుదలకు అంగీకరించినా చమురు ధరలకు అడ్డుకట్ట పడలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఈ ఉదయం బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటింది. అమెరికా బెంచ్ మార్క్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌కు సుమారు 94 డాలర్లకు చేరుకుంది. హర్మూజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలను అరికట్టడానికి వచ్చే వారం తన వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్ నుంచి 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేయాలని అమెరికా యోచిస్తోంది. చమురు ధరల పెరుగుదలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కూడా కుదేలయ్యాయి.

**విదేశీ పెట్టుబడిదారుల భారీ అమ్మకాలు**

స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు రూ. 6,267.31 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ. 4,965.53 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

**బంగారం, వెండి ధరలు ఇలా!**

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి మధ్య మార్కెట్లలో విలువైన లోహాలు పెరిగాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,629 ట్రేడ్ అవుతుంది. కిలో వెండి ధర రూ.2,67,121కు చేరింది. గురువారం పశ్చిమాసియాలో సూచీలు పడిపోవడానికి చమురు ధరలతో పాటు టారిఫ్‌లపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ప్రభావం చూపింది. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌తో సహా 16 దేశాల ఆర్థిక వ్యవస్థలపై దర్యాప్తునకు ఆదేశించింది. కొత్త టారిఫ్‌లు విధించేందుకు ఇది మరో మార్గం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం కూడా మదుపర్లపై ఒత్తిడి పెంచింది.



# ‘వృష కర్మ’ కోసం బీస్ట్ మోడ్‌లోకి మారిన నాగ చైతన్య

## 6 ప్యాక్ లుక్‌తో ఫ్యాన్స్‌కి షాక్ ఇచ్చిన చైతు

అక్కినేని వారసుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుసగా వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన ‘వృష కర్మ’ గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. “దీవఅఅస్త్రాాతీయబఅ” అనే క్యాప్షన్‌తో ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే ‘వృష కర్మ’ కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ఫైర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. “అన్నా నీ మూవీ కోసం వెయిటింగ్”, “వృషకర్మ ఇన్ యాక్షన్”, “చైతు ట్రాన్స్‌ఫర్మేషన్ సూపర్” అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అలాగే ఈ కొత్త లుక్‌కు కారణమైన ఫిట్‌నెస్ ట్రైనర్ కూడా స్పందిస్తూ, “నీ ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో నా వంతు పాత్ర ఉన్నందుకు సంతోషంగా ఉంది” అని రిప్లై ఇవ్వడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ‘వృష కర్మ’ సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.




# అక్షయ్ కుమార్ ‘భూత్ బంగ్లా’ టీజర్ విడుదల

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం ‘భూత్ బంగ్లా’. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన ‘భూల్ భులైయా’ వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని ‘వధుసురుడు’ అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.




# ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో నాకు సంబంధం లేదు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘ఎప్‌స్టీన్ ఫైల్స్’ వివాదంలో తన పేరు వినిపించడంపై ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తీవ్రంగా స్పందించారు. అమెరికన్ బిలియనీర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక అక్రమ రవాణా కేసులో బయటపడిన పత్రాలలో తన పేరు ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన పూర్తిగా తోసిపుచ్చాడు. తనకు ఆ ఫైల్స్‌తో కానీ, అందులో ఉన్న ఈమెయిల్స్‌తో కానీ ఎటువంటి సంబంధం లేదని అనుగార్ క్లారిటీ ఇచ్చాడు. 2017లో ఎప్‌స్టీన్ నిర్వహించిన ఒక ఈవెంట్ కోసం తాను బీజింగ్ వెళ్లాననే వార్తల్లో నిజం లేదని, అసలు తన జీవితంలో ఇప్పటివరకు బీజింగ్‌నే సందర్శించలేదని అనురాగ్ అన్నారు. 2014 కంటే ముందు కేవలం సినిమా లొకేషన్ల కోసం ఒక్కసారి మాత్రమే చైనా వెళ్లానని, అది కూడా శంఘైకి మాత్రమేనని వివరించారు. ఒక వక్తగా తనకు అనేక ఆహ్వానాలు వస్తుంటాయని, అంతమాత్రాన ఆ ఈవెంట్లతో తనకు సంబంధం ఉన్నట్లు కాదని ఆయన పేర్కొన్నారు. తన సినిమాల కంటే ఇలాంటి అనవసర పుకార్ల ద్వారానే తన పేరు ఎక్కువగా చర్చకు రావడంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, కేవలం ఏదో ఒక ఈమెయిల్‌లో పేరు కనిపించినంత మాత్రాన నిందలు వేయడం సరికాదని కొట్టిపారేశారు. అమెరికన్ బిలియనీర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మైనర్ బాలికలను ట్రాప్ చేసి, ఒక భారీ లైంగిక అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను నడిపిన వ్యవహారానికి సంబంధించిన కీలక పత్రాలనే ‘ఎప్‌స్టీన్ ఫైల్స్’ అంటారు. ప్రపంచ దేశాల అధ్యక్షులు, వ్యాపారవేత్తలు, మరియు సినీ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఎప్‌స్టీన్, 2019లో అరెస్టయి జైలులోనే అనుమానాస్పదంగా మరణించారు. ఇటీవల అమెరికా కోర్టు బహిర్గతం చేసిన సుమారు 900 పేజీల ఈ పత్రాల్లో ఎప్‌స్టీన్ ప్రైవేట్ ద్వీపానికి వెళ్లిన వారు, ఆయన విమానాల్లో ప్రయాణించిన ప్రముఖుల పేర్లు, కాల్ రికార్డులు మరియు బాధితుల సాక్ష్యాలు ఉన్నాయి. ఈ జాబితాలో బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రిన్స్ ఆండ్రూ వంటి అగ్రనేతల పేర్లు ప్రస్తావనకు రావడంతో అంతర్జాతీయంగా సంచలనం రేగింది. ఈ ఫైల్స్‌లో పేరు ఉన్నంత మాత్రాన వారంతా నేరస్తులు కాకపోయినా, ఎప్‌స్టీన్ నడిపిన చీకటి సామ్రాజ్యంతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే చేదు నిజాలు ఈ పత్రాల ద్వారా బయటపడుతున్నాయి.




# ‘ధురంధర్’ నుంచి అదిరిపోయే అప్‌డేట్.. ఐకానిక్ ‘ఆరి ఆరి’ సాంగ్ విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కలయికలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్: ది రివెంజ్’ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ‘ఆరి ఆరి’ సాంగ్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. 2003 నాటి పాపులర్ బాంబే రాకర్స్ పాటను శాశ్వత్ సచ్‌దేవ్ ఆధునిక బీట్స్‌తో రీమిక్స్ చేయగా, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాట విజువల్స్ అదరగొడుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రికార్డులు సృష్టించగా, తాజాగా విడుదలైన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది. దాదాపు రూ.400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ జస్కిరాత్ సింగ్ రంగీ మరియు హమ్జా అనే రెండు విభిన్న పాత్రల్లో ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం భారత గూఢచారి వ్యవస్థ చుట్టూ సాగే హై-వోల్టేజ్ డ్రామాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా మార్చి 19, 2026న హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక మార్చి 18 సాయంత్రం నుంచే భారీ ఎత్తున పెయిడ్ ప్రివ్యూలు ప్రదర్శించనుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ చిత్రం ‘స్త్రీ 2’ రికార్డులను అధిగమించి ఆల్-టైమ్ రికార్డ్ దిశగా దూసుకుపోతోంది.

# ఆసక్తికరంగా ‘దీవాన’ టీజర్

టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం ‘దీవాన’. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే ‘దీవాన’ గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా “ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు” మరియు “అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా” వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది.

I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at SWAMY OFFCET PRINTERS #1/339/17SREE RAM NAGAR, BHARPET, KURNOOL DISTRIC, ADONI 518301.
EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ramjal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com